



తురకపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు



◆ తురకపాలెంలో పర్యటిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే రామాంజనేయులు

అంతు చిక్కని మరణాలపై పరీక్షలు

తురకపాలెంలో కొనసాగుతున్న వైద్య శిబిరం

- నివేదికల తర్వాతే జ్వరాలపై స్పష్టత ఇస్తామన్న నేతలు
- గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- తురకపాలెం మరణాలపై సీఎం చంద్రబాబు అత్యవసర సమీక్ష

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో అంతు చిక్కని వరుస మరణాలపై వైద్య పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కూడా గ్రామంలో పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించి వివిధ పరీక్షలకు పంపారు. రక్తనమూనాల పరీక్ష ఫలితాల కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ పరీక్ష ఫలితాలతో.. మరణాలకు కారణమైన సూక్ష్మజీవిని నిగ్గు తేల్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సైతం వేచి ఉన్నారు. గ్రామానికి చెందిన 44 మంది జ్వర బాధితుల నుంచి సేకరించిన రక్తనమూనాలకు గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ ల్యాబోరేటరీలో పరీక్షించగా 9 బ్యాక్టీరియా పాజిటివ్‌గా నివేదికలు వచ్చినట్లు తెలిసింది. కాగా గ్రామానికి చెందిన పీ నరసింహరావు (40) జ్వరం, కీళ్ల నొప్పులు, దగ్గు, ఆయాసంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో చేరగా అతడ్ని పరీక్షించగా మెలియాయిడోసిస్ పాజిటివ్ తేల్చారు. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తురకపాలెం గ్రామానికి చెందిన ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ప్రబలిన అంతు చిక్కని జ్వరాల నేపథ్యంలో గ్రామంలో హెల్త్ ఎమర్జెన్సీగా భావించి విధులు నిర్వహించాలని ముఖ్య మంత్రి చంద్రబాబు ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు గ్రామంలో పర్యటించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి (మిగతా 8వ పేజీలో)

పడిపోయిన పరపతి



60 ఏళ్ల చరిత్రలో అథమ స్థానం

- ఎన్జీ రంగా వర్సిటీకి 31వ ర్యాంకు
- వైసీపీ పాలకుల పాపం.. యూనివర్సిటీకి శాపం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరపతి జాతీయ స్థాయిలో పతనావస్థకు చేరింది. వర్సిటీ 60 ఏళ్ల చరిత్రలో ఎన్నో నూతన ఆవిష్కరణలతో అగ్రస్థానంలో నిలిచి ప్రస్తుతం అథః పాతాళానికి చేరింది. తాజాగా విడుదలైన నేషనల్ ఇనిస్ట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ -2025లో 31వ ర్యాంకుకు పడిపోయింది. రెండేళ్లుగా జాతీయ స్థాయిలో యూనివర్సిటీ ర్యాంకు వరుసగా పడిపోతూనే ఉంది. 2023లో ఎన్ఐఆర్ఎఫ్ సర్వేలో వర్సిటీ 20వ ర్యాంకును, 2024లో 26వ ర్యాంకు సాధించింది. ఈ సంవత్సరం ర్యాంకు మరింత దిగజారింది. జాతీయ స్థాయిలోని వ్యవసాయ అనుబంధ యూనివర్సిటీల్లో అనేక అంశాలను పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. ఆ లెక్కన ఈ ఏడాది ఎన్జీ రంగా యూనివర్సిటీకి 100 మార్కులకు కేవలం 49 మార్కులు మాత్రమే దక్కాయి. కీలకమైన అంశాల్లో బాగా వెనుకబడినట్లు ఎన్ఐఆర్ఎఫ్ నివేదిక స్పష్టం చేస్తోంది.

ర్యాంకులే కీలకం..

దేశంలోని అన్ని విశ్వ విద్యాలయాల పనితీరు, అభివృద్ధికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు గీటురాళ్లు వంటివి. వీటి ఆధారంగానే అడ్మిషన్లు, నిధులు, ప్రాజెక్టుల కేటాయింపు ఉంటుంది. ర్యాంకులో వెనకబడితే నిధులు ఇవ్వడానికి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కూడా ఆసక్తి చూపదు. వర్సిటీ దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రస్తుతం సాధించిన ర్యాంకు గొడ్డలి పెట్టువంటిదని వర్సిటీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితులో రెండేళ్లుగా పెద్ద గా పరిశోధనలకు పెద్దపీట పడలేదన్న ఆరోపణలు విని పిస్తున్నాయి. వర్సిటీలో కొత్త పరిశోధనలు జరగలేదని వాస్తవం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు పూర్తిగా తెలుసు. ఈ పరిస్థితుల్లో (మిగతా 8వ పేజీలో)

అన్నీ అటువంటి ఆదేశాలే..

జగన్ ప్రభుత్వంలో నియమితులైన ఇన్‌చార్జి వీసీ నిర్ణయాలు అన్నీ తీవ్ర వివాదాలకు కారణమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న రూ.కోట్ల నిధులను పరిశోధనలకు సంబంధించిన ప్రాజెక్టులకు కేటాయించకుండా, కేవలం తిరుపతికి మాత్రమే కేటాయించి దుర్వినియోగపరుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆర్థిక కమిటీ లేకుండానే నిధులు కేటాయించడం వంటి వ్యవహారాలు కూడా వివాదాలకు కారణమవుతున్నాయి.

ఎరువులు ఏమవుతున్నాయ్



ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 18 వేల నుంచి 20 వేల టన్నుల యూరియా సొసైటీల్లో పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ ఇందుకు సంబంధించి ఏయే సొసైటీల్లో ఎంతమంది రైతులకు ఇచ్చారనే లెక్కలు కొరవడ్డాయి.

ఇటీవల వరకు వర్షాభావ పరిస్థితుల్లో సాగు సాగ లేదు. ఇటీవల వర్షాలకు వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అయితే సాగు పనుల్లో నిమగ్నమవ్వాల్సిన రైతులు ఎరువులు కోసం ఎగబడుతున్నారు. అధికారులు పుష్కలంగా యూరియా నిల్వలు ఉంటున్నాయి అంటున్నారు. అయితే ఎక్కడికక్కడ యూరియా అందక రైతులు అల్లాడు తున్నారు. వంద బస్తాలు వచ్చాయంటే పదిం తలుగా రైతులు పోటెత్తు తున్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించినా ఒక్క బస్తా కూడా దొరకడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అధికారిక లెక్కల ప్రకారం పంపిణీ చేసిన యూరియా, ఉన్న నిల్వలకు సాగు అయిన విస్తీర్ణానానికి పొంతనే లేదు. అయితే వచ్చిన యూరియా ఏమైంది.. ఎటు పోయింది.. అనేది తెలియడం లేదు. అధికారులు ఎక్కడి కక్కడ నిఘా, తనిఖీలు టాస్క్‌ఫోర్సు బృందాలు ఏర్పాటు చేసినా ఎరువులు ఏమయ్యాయో ఎక్కడ ఉన్నాయో తెలుసుకోలేక పోతున్నారు. రైతులు మాత్రం యూరియా దొరక్క పాలుపోని పరిస్థితుల్లో చిక్కుకున్నారు.

యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

- సాగు విస్తీర్ణం అంతంతే..
- విపరీతంగా డిమాండ్
- ప్రభుత్వ ప్రకటనలకు.. పొంతనలేని క్షేత్రస్థాయి పరిస్థితులు

(బాపట్ల, రేపల్లె నరసరావుపేట, దాచేపల్లి - ఆంధ్రజ్యోతి)

దాదాపు రెండు వారాలుగా అన్నదాతల యూరియా ఇక్కట్లపై చర్చ జరుగుతూనే ఉంది. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద క్యూల్లో రైతులు కనిపిస్తున్నారు. యూరియా సమృద్ధిగా ఉందని అధికారులు ప్రకటనలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారం అయిన దాఖలాలు కనిపించడం లేదు. వరి పైరు ముంపు బారిన పడడం వల్ల రైతులు వెంటవెంటనే యూరియా చల్లాల్సి వచ్చిందని అందుకు తాత్కాలికంగా సమస్య తలెత్తిందని పది రోజుల క్రితం (మిగతా 8వ పేజీలో)



రేపల్లె : నల్లూరుపాలెంలో ఎరువుల కోసం స్లిప్‌లు రాయించుకుంటున్న రైతులు

అక్రమ రవాణాపై నిఘా



పొందుగల వద్ద కలెక్టర్, ఎస్పీ అర్ధరాత్రి తనిఖీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లా సరిహద్దుల నుంచి తెలంగాణకు అక్రమంగా యూరియా రవాణా అవుతున్న నేపథ్యంలో అధికారులు దృష్టి సారించారు. సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా ఏర్పాటు చేశారు. యూరియా విక్రయాలపై కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు నేరుగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి వీరిద్దరూ వారి వాహనాల్లో కాకుండా ప్రైవేటు వాహనాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాష్ట్ర సరిహద్దులోని పొందుగల చెక్‌పోస్టు వద్ద రాత్రి 10.30 నుంచి అర్ధరాత్రి దాటేవరకు వారు స్వయంగా అన్ని వాహనాల్లోనూ తనిఖీ చేశారు. ఆ తర్వాత దాచేపల్లిలో ఎరువులు నిల్వ చేసిన గోదాముల్లో కూడా సోదాలు చేశారు. శుక్రవారం తెల్లవారు జాము 2.30 గంటల వరకు ఈ తనిఖీలు సాగాయి.

● ఆందోళన వద్దు : కలెక్టర్ అరుణ్‌బాబు

యూరియా అక్రమాలపై అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోందని కలెక్టర్ అరుణ్‌బాబు స్పష్టం చేశారు. అనవసర ఆందోళనలతో అవసరానికి మించి యూరియా కొనుగోళ్లకు రైతులు దూరంగా ఉండాలని సూచించారు.

● ఎరువుల అక్రమాలపై పీడీ యాక్టు :ఎస్పీ శ్రీనివాసరావు

యూరియా అక్రమ నిల్వ చేసినా, అక్రమాలకు పాల్పడినా సంబంధితులపై ఏకా, పీడీ యాక్టు ప్రయోగిస్తామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు హెచ్చరించారు. పొందుగల, తంగెడ, నాగార్జున సాగర్ చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలను ముమ్మరం చేశామన్నారు.

సూర్యలంక, రామాపురంలో బీచ్ ఫెస్టివల్

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26, 27, 28 తేదీల్లో సూర్యలంక, రామాపురంలో బీచ్ ఫెస్టివల్‌ను అట్టహాసంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ సంఘాల ప్రతినిధులు, అధికారులతో బీచ్‌ఫెస్టివల్ నిర్వహణపై శుక్రవారం జరిగిన సమీక్షలో కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. దక్షిణ భారత స్థాయిలో బీచ్ క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. వాలీబాల్, ఖోఖో, బాక్సింగ్ వంటి క్రీడా పోటీలు భారీ స్థాయిలో నిర్వహించాలన్నారు. సినీ కళాకారులు, జబర్దస్త్ టీంల ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించాలన్నారు. డ్యాన్సులు, మ్యూజికల్స్ నైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. బోట్ల ప్రదర్శన, స్పీడ్‌బోట్లు, స్పోర్ట్స్ రైడర్స్ గుర్రాలు, ఒంటెలు ప్రదర్శన ఉంచాలన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం 100 ఫుడ్ స్టాల్స్, 350 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, జిల్లా పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు వేగవంతం చేయండి

మంత్రి అచ్చెన్నాయుడ్ని కోరిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడ్ని కోరారు. శుక్రవారం మంత్రి కార్యాలయంలో అచ్చెన్నాయుడ్ని కలిసి రైతుల సమస్యలను ఎమ్మెల్యే వివరించారు. పొగాకు కొనుగోలు, నిధుల జమ, యూరియా నిల్వలు తదితరాలపై మంత్రితో చర్చించారు. ప్రభుత్వం నల్లబర్లీ రైతులకు కొండంత అండగా నిలిచిందని ఏలూరి తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషి వెలకట్టలేని దన్నారు. రైతుల వద్ద ఉన్న పంటను మొత్తాన్ని కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన పొగాకును నిల్వ చేసేందుకు గోదాములను వేగవంతంగా గుర్తించేలా చర్యలు తీసు కోవాలని మంత్రిని కోరారు. ఇప్పటి వరకు సుమారు రూ.220 కోట్ల విలువైన బర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకు గాను రూ.54 కోట్లు రైతుల ఖాతాలో నగదు జమైం దన్నారు. పర్చూరు నియోజకవర్గంలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాను అందిస్తున్నట్లు ఏలూరి తెలిపారు. సొసైటీల ద్వారా యూరియాను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా బర్లీసాగు నిషేధంపై రైతులకు వివరించి ప్రత్యామ్నాయ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

గురుదేవోభవ

- 33 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం
- ఘనంగా గురుపూజోత్సవం
- ఉపాధ్యాయులకు రాధాకృష్ణన్ స్ఫూర్తి కావాలన్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధి నిర్వహణలో చూపిన ప్రతిభా పాటవాలను కీర్తిస్తూ.. విద్యార్థులను తీర్చిదిద్దుతోన్న వైనాన్ని విశ్లేషిస్తూ.. హర్షధ్వానాల మధ్య సత్కరిస్తూ.. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక కాపు కళ్యాణ మండపంలో గురుపూజోత్సవం జరిగింది. 33 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయుల ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ అసమానతలన్నీ విద్యతోనే రూపుమాపగలమన్నారు. సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాధాకృష్ణన్ స్ఫూర్తితో ఉపాధ్యాయులు ముందుకు సాగాలన్నారు. నిరంతరం నేర్చుకునే ఉపాధ్యాయులే విద్యార్థుల జీవితాలను చక్కగా తీర్చిదిద్దగలరన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందన్నారు. ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షల చొప్పున ఎంపిక చేసిన పది పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ పిల్లలకు విద్యాబుద్ధులతోపాటు ప్రయోజకులను చేసే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. దేశభవిష్యత్తులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, చేనేత కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, సమగ్ర శిక్షాభియాన్ ఏపీసీ మర్రెడ్డి నాగిరెడ్డి, ఆర్డీవో పి.గ్లోరియా, ఎంఈవోలు ఎస్.నిరంజన్, ప్రసాదరావు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు వై.సత్యవతిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ సునీత

దేశానికే ఆదర్శం.. ఆరోగ్య బీమా: చీఫ్ విప్ జీవీ

వినుకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న యూనివర్సల్ హెల్త్ పాలసీ పేదల పాలిట సంజీవని కానుందని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డబ్బు లేక చికిత్సలు అందుకోలేని పరిస్థితుల్లో ఇకపై ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఉండవని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశ పెడుతున్న ఈ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సుమారు 1.63 కోట్ల కుటుంబాలు, 5 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం అందించనున్న అందరికీ ఆరోగ్య బీమా వంద శాతం గేమ్ ఛేంజర్ అవుతుందని పేర్కొన్నారు. రూ.25 లక్షల వరకు పరిమితి ఉండడం వల్ల ఇకపై ఖరీదైన వైద్య సేవలకు ఎవరూ భయపడాల్సిన పరిస్థితి ఉండదన్నారు. చిన్న జ్వరం నుంచి గుండె ఆపరేషన్లు, డయాలసిస్, క్యాన్సర్ చికిత్సల వరకు నూతన విధానంలో విస్తృత కవరేజీ అందిస్తారని తెలిపారు. రాష్ట్రం మొత్తం దాదాపు 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 3,257 పైగా వైద్య సేవలు రూపాయి ఖర్చు పెట్టకుండానే అందుతాయన్నారు. ఆస్పత్రుల్లో చేరిన 6 గంటల్లోనే క్యాష్‌లెస్‌కు అనుమతులు ఇస్తారన్నారు. రైతుల ముసుగులో యూరియాపై వైసీపీ, జగన్ చేస్తున్న ఫేక్ ప్రచారాల్ని ఎవరు నమ్మడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్రం అదనంగా 53 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసిందని, ఆ నిల్వలు రైతులకు చేరేలోపు రాజకీయ లబ్ధికి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో భూ అక్రమాలు

లేని భూమిని ప్రభుత్వానికి అప్పగించి నిధులు డ్రా: బీజేపీ నేత రమేష్

వినుకొండటౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో వైసీపీ నాయకులు భూ అక్రమాలకు పాల్పడినట్లు బీజేపీ సీనియర్ నాయకుడు మేడం రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధి.. జాలలపాలెం పంచాయతీలో ఈ అక్రమాలు జరిగినట్లు తెలిపారు. సర్వే నంబరు 113/3లో 3.63 ఎకరాలు, 60-17/1ఏలో ఎకరం 20 సెంట్లు మొత్తం 4.83 ఎకరాలను 1995లో విజయవాడలోని మూల్పూరి ఆగ్రో టెక్‌కు చెందిన యజమానులకు విక్రయించారని తెలిపారు. అదే సర్వే నంబర్లలోని భూమిని 2020లో వైసీపీ పెద్దల సాయంతో ప్రభుత్వానికి విక్రయించి, రూ.80 లక్షలు అక్రమంగా ఆర్జించారని పేర్కొన్నారు. ఈ నెల 3న సీసీఎల్ చీఫ్ కమిషనర్ శ్రీలక్ష్మికి ఫిర్యాదు చేశారన్న అంశం వెలుగులోకి రావడంతో వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైందని తెలిపారు. జగనన్న కాలనీలకు భూములు అప్పగించిన వారి వివరాలు ప్రభుత్వం వెలికి తీస్తే వైసీపీలోని కొందరు పెద్దల అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

తుంగభద్రలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం


తేలాడుతున్న మృతదేహం

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణం నుంచి ప్రవహించే తుంగభద్ర డ్రెయిన్‌లో శుక్రవారం గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం తుంగభద్ర డ్రయిన్‌లో గుర్తుతెలియని యువకుడి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడి మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీసి తీశారు. గుర్తుతెలియని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వైసీపీ హయాంలో సొసైటీ అక్రమాలపై సమగ్ర విచారణ

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రాథమిక సహకార సంఘాల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్రస్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. పచ్చలతాడిపర్రు ప్రాథమిక వ్యవసాయ పరిమితి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరిగింది. సొసైటీ అధ్యక్షుడిగా జనసేన నాయకుడు గంధం సురేంద్ర, సభ్యులుగా పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యంపరాల గోపీకృష్ణ, కట్టెంపూడి గ్రామస్తుడు యక్కటి నాగేశ్వర రావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో దండమూడి గ్రామంలో ఎన్నో రకాల విధ్వంసానికి తెరతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతిపక్ష నాయకులు వినాయక నిమజ్జనాలను కూడా చేసుకోవడానికి వీల్లేకుండా ఆటంకాలు కలిగించారని దుయ్యబట్టారు. పోలీసులను పెట్టి బెదిరింపులకు పాల్పడి, అక్రమ కేసులు బనాయించి.. వేధింపులకు గురిచేసినా జనసేన, టీడీపీ నాయకులు వాటిని ఎదుర్కొన్నారని ప్రశంసించారు. తేనె పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న గంధం సురేంద్ర ఆర్థిక మూలాల మీద దెబ్బ తీయాలని చూశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో బోగస్ డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి, అక్రమ మార్గంలో రుణాలు తీసుకున్నారని విమర్శించారు. సొసైటీల్లో రైతుల పేర్ల మీద రుణాలు తీసుకొని.. కోట్ల రూపాయలు కొల్లగొట్టి అక్రమార్కులను కఠినంగా శిక్షిస్తామని ధూళిపాళ్ల స్పష్టం చేశారు. పచ్చలతాడిపర్రు సొసైటీ అధ్యక్షులుగా ఉన్నవారు ఉన్నత పదవులు చేపట్టారని గుర్తుచేశారు. సొసైటీ పరిధిలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా.. పంట రుణాలు సకాలంలో అందించడంతోపాటు ఎరువులు సరఫరా చేసి వారి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ నూతన కార్యవర్గ సభ్యులకు సూచించారు. జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా దండమూడి సొసైటీకి అత్యంత పిన్న వయస్కుడు సురేంద్రను అధ్యక్షుడిగా నియమించడంపై ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సురేంద్రకు పదవి రావడంతో కొంతమంది అసంతృప్తి వాదులు అతనిపై అసత్యాలు ప్రచారం చేశారని సురేంద్ర వాటిని రైతు సేవ ద్వారా ఎదుర్కోవాలని సూచించారు. అతిథుల సమక్షంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను, ముఖ్య అతిథులను జనసేన నియోజకవర్గ నాయకులు ఘనంగా సత్కరించారు. కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1.0820 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు 3 గేట్లను 1.5 మీటర్లు, ఒక గేట్‌ను మీటర మేర ఎత్తి 25,490 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి అనంతరం టేల్ రేస్ చానల్ ద్వారా 8,600.. మొత్తం 34,099 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0820 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 (పూర్తిస్థాయి) మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 (పూర్తి స్థాయి) టీఎంసీలకు సమానమని తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటి మట్టం శుక్రవారం నాటికి 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 7,029, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 52,115 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 52,115 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

స్వల్పంగా వరద ఉధృతి


స్పిల్ వే ద్వారా నీరు విడుదల

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుతో పాటు, కీసర, మున్నేరు, వెలగలేరు, తదితర ప్రధాన వాగుల నుంచి 26,298 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వకు 10,076, పశ్చిమ డెల్టాకు 8,004, గుంటూరు చానల్‌కు 148 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

యువత భుజస్కంధాలపైనే భారత ఉజ్వల భవిష్యత్తు

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో భాష్యం రామకృష్ణ తదితరులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): దేశ ఉజ్వల భవిష్యత్తు యువత భుజస్కంధాలపై ఉందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏటుకూరు రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. నలంద, తక్షశిల వంటి విశ్వ విద్యాలయాల ద్వారా ప్రపంచ మానవాళికి జ్ఞాన మందించిన ఘనమైన మన భారత సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాబోవు రోజుల్లో విద్యా వ్యవస్థలో సంస్కరణల ద్వారా పెను మార్పులను ప్రతి ఒక్క విద్యార్థి ఆకళింపు చేసుకుంటూ వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ జ్ఞానం, నైపుణ్యాలను సరైన మార్గంలో నడిపించే వారే గురువు అన్నారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ అంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లబోతు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఏ వృత్తిలో రాణించాలన్నా.. గురువుల పాత్ర అమూల్యమైనదన్నారు. భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు జీవితంలో ఎంతో సాధించిన.. ప్రేరణాత్మకమైన వ్యక్తులను పరిచయం చేయడం జరుగుతుందన్నారు. వారి అనుభవసారాన్ని వినమ్రంగా గ్రహించి లక్ష్యసాధనకు కృషిచేయాలని విద్యార్థులకు సూచించారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన


మాట్లాడుతున్న కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కులగణన పూర్తిచేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలను ఇచ్చిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ పిలుపునిచ్చిన నేపథ్యంలో నేటికీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం తేల్చకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కులగణన ప్రక్రియను పూర్తిచేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పారేపల్లి మహేశ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నిధులు కేటాయించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిధులు వస్తాయని ఆశపడ్డామని తెలిపారు. రాబోయే రోజుల్లో బీసీల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, కోశాధికారి కన్నా మాస్టారు, నేతలు పాల్గొన్నారు.

రైలుకు ఎదురెళ్లి.. వ్యక్తి ఆత్మహత్య

తెనాలి క్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొలకలూరు - దుగ్గిరాల రైల్వేస్టేషన్ మధ్య గుర్తుతెలియని వ్యక్తి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని తెనాలి జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి శుక్రవారం తెలిపారు. రైలు దుగ్గిరాల స్టేషన్ దాటి వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ట్రైన్‌కు ఎదురెళ్లాడు. రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రైలు డ్రైవర్ సమాచారం మేరకు సంఘటన స్థలానికి ఎస్ఐ పరిశీలించారు. మృతుడి శరీర భాగాలు రైల్వే ట్రాక్ వెంట వివిధ ప్రాంతాల్లో పడి ఉండటం గుర్తించారు. మృతుడుకి.. 45-50 సంవత్సరాల వయస్సు ఉంటుందని కాటన్ లుంగీ, ఎరుపు రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకటాద్రి వివరించారు.

యూట్యూబ్ చూసి.. చోరీల్లో ఆరితేరాడు

● నెలన్నరలో కార్ల అద్దాలు పగలగొట్టి 18 దొంగతనాలు

● 10 కేసులు నమోదు...నిందితుడు నరసరావుపేట రౌడీషీటర్ బాజీ

● వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్, పక్కన సౌత్ డీఎస్పీ భానోదయ, సీఐ వంశీధర్

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూట్యూబ్‌లోని చోరీ వీడియోలు చూసి.. కారు అద్దాలు పగలగొట్టి ఎలా నేరాలు చేయాలో నేర్చుకున్న ఓ రౌడీ షీటర్ అదే తరహాలో వరుస నేరాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసిరాడు. గుంటూరు నగరంలోనే నెలన్నరలో 18కి పైగా నేరాలకు పాల్పడ్డాడు. అయితే అందులో చాలా నేరాల్లో డాక్యుమెంట్లు, అతి తక్కువ మొత్తంలో నగదు పోవడంతో అవి కేసులు నమోదుకు దారి తీయలేదు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సౌత్ డీఎస్పీ భానోదయ ఆధ్వర్యంలోని బృందం.. వరుస నేరాలకు పాల్పడుతోన్న నిందితుడికి చెక్ పెట్టారు. సీసీ కెమెరా ఫుటేజీలతోపాటు ఇతర సాంకేతిక ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి నిందితుడిని నరసరావుపేట క్రిస్టియన్‌పేటకు చెందిన రౌడీషీటర్ జంగం బాజీగా గుర్తించారు. బాజీని అరెస్ట్ చేసి.. అతని నుంచి ఆరు ల్యాప్‌ట్యాప్‌లు, 11 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్ కుమార్ నిందితుడు బాజీని మీడియా ఎదుటి హాజరుపరిచి, వివరాలు వెల్లడించారు. నరసరావుపేటలోని క్రిస్టియన్ పేటకు చెందిన జంగం బాజీ తన సోదరుని చంపిన వ్యక్తులను హత్య చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అతని రౌడీషీట్ కూడా ఉంది. బాజీ వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అత్యంత చాకచక్యంగా రెప్పపాటులో కారు అద్దాలు పగలగొట్టి అందులో ఖరీదైన వస్తువులు, బ్యాగులు, లాప్‌ట్యాప్‌లు అపహరిస్తున్న హైటెక్ దొంగగా మారాడు. అతని సొంతూరు నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామం. గుంటూరు నగరంలోనే 18 వరకు కారు అద్దాలు పగలగొట్టి చోరీలు చేసిన నేరాలకు పాల్పడ్డాడు. అందులో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో నాలుగు, నగరంపాలెంలో మూడు, పెదకాకాని, పాత గుంటూరు, అరండల్ పేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం పది కేసులు మాత్రమే నమోదు అయ్యాయి.

యూట్యూబ్ చూసి..ఆరితేరి..!

బాజీ యూట్యూబ్‌లో వీడియోలు చూసి పోలీసులకు దొరకకుండా ఎలా తప్పించుకోవాలో... నేర్చుకున్నాడు. హెల్మెట్ ధరించి, చేతులకు గ్లౌజులు వేసుకొని నేరాలకు చేయసాగాడు. ముఖ్యంగా పార్కింగ్ స్థలాల్లో పెట్టిన కార్లను టార్గెట్ చేస్తాడు. గులకరాయితో కారు అద్దం పగలగొట్టి అందులో ఉన్న లాప్‌ట్యాప్‌లు, బ్యాగులు, నగదు వంటి వస్తువులను చిటికలో మాయం చేస్తాడు. శివారు ప్రాంతాల్లోని ఏటీఎం సెంటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, బ్యాంకులు తదితర చోట్ల పార్కింగ్ చేసిన కార్లను, యజమానులను గుర్తించి వారు ఎక్కడికి వెళ్తున్నారో గమనించి ఆ తర్వాత నేరానికి పాల్పడతాడు. బాజీ గతంలో నరసరావుపేట పరిసర ప్రాంతాల్లోనూ ఇతర నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో నల్లపాడు పోలీసులు నిందితుడు బాజీ చెప్పిన వివరాలు ప్రకారం ఆయా ప్రాంతాల్లో ఈ తరహా నేరాల గురించి ఆరా తీస్తున్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల అత్యధిక నేరాల్లో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలే పోలీస్ శాఖకు ఉపయోగపడుతున్నాయన్నారు. బాజీని అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ సతీష్ కుమార్ అభినందించి రివార్డులు ప్రకటించారు. సీఐ వంశీధర్, ఎస్ఐ వాసు, సీసీఎస్ సీఐ అనురాధ, నల్లపాడు హెడ్ కానిస్టేబుల్ కె.సుబ్బారావు, కానిస్టేబుళ్లు బిక్షు నాయక్, షేక్ మస్తాన్ వలి, టి.సాంబశివరావు తదితరులకు ప్రశంసా పత్రాలు అందించి, అభినందించారు.

తుప్పు పట్టి పోవాల్సిందేనా?


ఫుట్‌పాత్‌పై పడవేసిన గడ్డర్లు

తెనాలిఅర్బన్,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చందోలు -తెనాలి ప్రధాన రహదారిలో వైకుంఠపురం వద్ద ఫుట్‌పాత్‌పై వేసిన గడ్డర్లు తుప్పు పట్టి పోతున్నాయి. ఇక్కడ ఉన్న రైల్వే ట్రాక్ రక్షణకు ఇరువైపులా అధిక లోడు లారీలు, ఇతర వాహనాలు నివారించేందుకు ఈ గడ్డర్లు ఏర్పాటు చేశారు. అయినా.. కొందరు భారీ వాహన డ్రైవర్లు దీనిని పట్టించు కోకుండా.. ఈ మార్గంలో వెళ్లడంతో..వాహనాలు గడ్డర్లకు తగిలి ఇరుక్కుపోతున్నాయి. ఇలా పలుమార్లు గడ్డర్లు దెబ్బతిన్న ఘటనలు ఉన్నాయి. దెబ్బతిన్న గడ్డర్లను తొలగించి ఫుట్‌పాత్‌లపై పడేశారు. కొద్దిగా దెబ్బతిని వీటిని మరమ్మతులు చేయించి ఉపయోగించకుండా.. ఇలా నిరుపయోగంగా పడేశారు. రైల్వే అధికారులు స్పందించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.

దురంతో ఎక్స్‌ప్రెస్‌కు రెండు స్లీపర్ క్లాస్ బోగీలు

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వారంలో మూడు రోజులు గుంటూరు మీదగా ప్రయాణించే 22204/22203 సికింద్రాబాద్ - విశాఖపట్నం- సికింద్రాబాద్ దురంతో ఎక్స్‌ప్రెస్‌కి రెండు స్లీపర్ క్లాస్ బోగీలను జోడించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ నెల 20 నుంచి సికింద్రాబాద్ వైపున, 21 నుంచి విశాఖపట్టణం వైపున ఈ స్లీపర్ క్లాస్ బోగీలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే అడ్వాన్స్ రిజర్వేషన్‌ని కూడా రైల్వే శాఖ ప్రారంభించింది. సికింద్రాబాద్‌లో ప్రతీ సోమ, బుధ, శనివారం రాత్రి 8.15 గంటలకి, విశాఖపట్నంలో మంగళ, గురు, ఆదివారాల్లో రాత్రి 7.50 గంటలకు ఈ రైలు బయలుదేరుతుంది.

అట్టహాసంగా డేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న డేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. నాజ్ సెంటర్లోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్లో జరిగిన వేడుకల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని డేగల ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు, అభిమానులతో కలిసి ప్రభాకర్ కేక్ కట్ చేశారు. డేగల యూత్, మిత్రమండలి ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించి వృద్ధులకు చీరలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, అన్నదానం వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం, అంధ పాఠశాల విద్యార్థులకు మందులు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. సుమారు 70 మంది యువకులు రక్త దానం చేశారు. ముందుగా నాజ్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా బాణ సంచా పేల్చి.. సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రలువురు నాయకులూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేయడంలో ప్రభాకర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఛైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నామినేటెడ్ పదవులు ఇచ్చి తనలాంటి యువతకు ప్రోత్సాహం ఇచ్చారన్నారు.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజినీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప జిల్లాల కేంద్రాల్లో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహా ముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 0404 1896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

2 కేజీల గంజాయి స్వాధీనం

● పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు

పెదకాకాని, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసులు గంజాయి కలిగిన ఆరుగురు నిందితులను అదుపులో తీసుకున్నారు. శుక్రవారం రాత్రి పెదకాకానిలోని జాకీర్ హుస్సేన్ నగర్‌కి చెందిన వీరి నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం నుంచి రైలు మార్గం ద్వారా గంజాయిని వీరు తీసుకొచ్చారు. సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టి నిందితులను, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధితో చేయూత

- ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- 26 మంది బాధితులకు రూ.16.84 లక్షల చెక్కులు అందజేత

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా బాధిత కుటుంబాలకు చేయూతనందిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల పట్టణంలోని 26మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.16,84,405ల చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సంక్షేమ దృక్పథానికి ఇది నిదర్శనమన్నారు. ఇప్పటికే అనేక మందికి సాయం చేసినట్లు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సమస్యలను త్వరగా పరిష్కరిస్తూ ప్రజలకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. అర్హులైన మధ్యతరగతి, పేద కుటుంబాలవారు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నాయకులు మందపాటి ఆంద్రేయ, జిట్టా శ్రీనివాసరావు, శీలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినాయకునికి ఎమ్మెల్యే వేగేశన పూజలు

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంకటపాలెంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండపం వద్ద శుక్రవారం నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. పార్టీశ్రేణులు, కమిటీ సభ్యులతో కలిసి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రావిపూడి నాగమల్లేశ్వరరావు, తెలుగురైతు అధ్యక్షుడు నక్కల వీరరాఘవయ్య యార్లగడ్డ వెంకటసుబ్బారావు, వందనం, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్
- అడహక్ కమిటీ చైర్మన్‌గా నాగేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్ తెలిపారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో శుక్రవారం సాయంత్రం జిల్లా అడహక్ కమిటీ నియామకంపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దసరాకు ఒక డీఏ ఇచ్చే విధంగా చూస్తామన్నారు. ఉద్యోగవిరమణ చేసిన వారికి పెండింగ్‌లో ఉన్న గ్రాట్యూటీ ఇప్పిస్తామని హామీనిచ్చారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో మాట్లాడినట్లు తెలిపారు. అనంతరం అడహక్‌కమిటీ ఎంపిక జరిగింది. కమిటీ చైర్మన్‌గా పి.నాగేశ్వరరావు, కన్వీనర్‌గా బి.ప్రసాదరావు, కోశాధికారిగా డి.నాగేశ్వరరావు, సీహెచ్ శేషుబాబు, జి.కిరణ్‌కుమార్, కె.సృజనకుమారిలను నియమించారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో ఉద్యోగుల సభ్యత్వ నమోదు పూర్తి చేసి బాపట్ల, చెరుకుపల్లి, రేపల్లె, చీరాల, అద్దంకి, పర్చూరు, మార్టూరు, తాలూకాల ఎన్నికలను పూర్తి చేసిన తర్వాత నవంబరు నెల చివరిలో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి డివి.రమణ, గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, శ్యామ్ సుందర్ శ్రీనివాస్, ప్రకాశం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నారు

- మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్న రైతులకు అవసరమైనంత యూరియాను అందుబాటులోకి తీసుకురాలేకపోయారని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున ఆరోపించారు. ఈ విషయమై బాపట్ల వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మేరుగ నాగార్జున మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్‌లో యూరియాను రూ.400 నుంచి రూ.600కు విక్రయిస్తున్నారని విమర్శించారు. పొగాకు, మిర్చి, రైతుల కష్టాలపై ఈనెల 9వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో ప్రతి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ అనేక ఆందోళనల ద్వారా రైతుల సమస్యలను వివరించినప్పటికి ఇంకా రైతులు ఇబ్బంది పడుతూనే ఉన్నారన్నారు. ఈ సమావేశంలో పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఎం.ఏడుకొండలురెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు డి.సీతారామిరెడ్డి, గవిని కృష్ణమూర్తి, మాజీ వైస్‌చైర్మన్ పిన్నిబోయిన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఇన్సూరెన్స్, ఆర్టీఏ చలానాలు రద్దు చేయాలి

- కార్మిక శక్తి ఆటో డ్రైవర్స్ యూనియన్

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు భారంగా మారిన ఇన్సూరెన్స్, ఆర్టీఏ చలానాలు రద్దు చేయాలని కార్మికశక్తి ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో శుక్రవారం యూనియన్ నాయకులు, సభ్యులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటం వల్ల తమ జీవనోపాధి దెబ్బతిందన్నారు. జీవనోపాధికి భరోసా కల్పించాలని కోరారు. ఆటోకార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జి.పూర్ణచంద్రరావు, కె.కోటేశ్వరరావు, ఎం.రాఘవరావు, వి.నాగేశ్వరరావు, కె.రత్నబాబు, ఎస్‌కె.మస్తాన్, రాంబాబు, జాన్, గోకరాజు తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న కార్మికశక్తి ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు

పేద కుటుంబాలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జేసీఎన్ఎంఎం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కస్నెగంటి జాన్‌వెస్లీ పేద కుటుంబాలవారికి ఆహార ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. పట్టణంలోని డంపింగ్‌యార్డు, రాజీవ్ గృహకల్ప కూడలి, ఏరియా వైద్యశాల, కర్లపాలెం మండలం యాజలి, బీడారు దిబ్బ పరిసర ప్రాంతాల్లో రోడ్లపక్కనే నివాసం ఉండే వారికి ఆహార ప్యాకెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కట్టా విజయరాజు, జి.జయపాల్, దాసరి ఏసుబాబు, కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

10న రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్యసమావేశం

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశాల మేరకు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీన కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీరామ్ తెలిపారు. ఈ సమావేశంలో మూడు సంవత్సరాల ఆర్థిక నివేదికతోపాటు రాబోయే మూడు సంవత్సరాలకు నూతన పాలకవర్గ ఎన్నిక జరుగునని తెలిపారు. సభ్యత్వం ఉన్న సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

మెరుగైన సమాజ ఏర్పాటులో గురువులదే కీలకపాత్ర

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన సమాజ ఏర్పాటులో గురువులే కీలకపాత్ర అని సమాజంలో ప్రతిఒక్కరితో పూజింప బడేది గురువునేనని ప్రోడీజీ విద్యా లయ ప్రిన్సిపాల్ బ్రజేష్ కానూన్‌గో అన్నారు. మండలంలోని మత్స్యపురికాలనీ కనకాద్రినగర్‌లో గల ప్రోడీజీ విద్యాలయ సీబీఎస్ఈ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు నివాళి అర్పించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు పాద పూజ చేశారు. గురువులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు బహుమతులను డైరెక్టర్స్ ఎం.శ్రీనివాసరావు, సీహెచ్ పార్థసారథి, పి.ఉదయచంద్రరావు అందజేశారు.

ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో..



సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి అర్పిస్తున్న ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అధ్యాపకులు

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ ఎం సర్దార్‌బేగ్ అధ్యాపకులతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ బ్లెస్సీసాగర్, ఎన్ వినోద, సీహెచ్.సోమేశ్వరరావు, వై.అరుణకుమారి, కె.సౌజన్య, ఈ గౌతమి, కే నివేదిత, సునీత, దిలీప్, వినోద్‌బాబు, లావణ్య, నూకరత్నం, ఫణేంద్ర పాల్గొన్నారు.

దేశం గర్వించతగిన వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి : వైసీపీ

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భారతీయ తత్వాన్ని ప్రపంచానికి చాటిన తత్వవేత్త, దేశం గర్వించతగిన గొప్ప విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ అని మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతిలు పేర్కొన్నారు. బాపట్ల వైసీపీ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు.



రాధాకృష్ణన్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే రఘుపతి తదితరులు

హైవెండ్ హైస్కూల్లో...

కర్లపాలెం సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భావితరాలకు దిక్సూచిగా వ్యవహరించేది ఉపాధ్యాయులు మాత్రమేనని హైవెండ్ హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ బొడ్డు సాయిమహేంద్రబాబు అన్నారు. కర్లపాలెం హైవెండ్ హైస్కూల్లో గురుపూజోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు కుర్చీలాట, తాడులాగుడు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకలను డైరెక్టర్‌లు వెంకటజ్యోతి, చాందిని, ఆంజనేయప్రసాద్‌లు పర్యవేక్షించారు.



ఉత్తమ ఉపాధ్యాయుడు రఫీని సన్మానిస్తున్న ఎండీ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్‌లు ఆంజనేయప్రసాద్, చాంధిని

కర్లపాలెం మండలంలోని పలుప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయిని శోభారాణి కృషి

అమృతలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పని చేసిన పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయినీ ఎం.శోభారాణి కృషి చేశారు. విద్యారంగంలో ఆమె చేసిన కృషికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును శుక్రవారం అందుకున్నారు. స్థానిక సంత బజారులోని మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పని చేస్తున్న ఆమె పాఠశాలకు మరమ్మతులు చేయించారు. అవార్డు పొందిన శోభారాణిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న శోభారాణి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రోజారమణి

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రోజారమణి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మండల పరిధిలోని వెల్లటూరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రోజారమణి శుక్రవారం బాపట్లలోని కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఉత్సవాలలో కలెక్టర్ వెంకటమురళి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతను సహ ఉపాధ్యాయులు, మండల విద్యా శాఖాధికారులు అభినందించారు.



కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న రోజారమణి

కొల్లూరు మండలంలో...

కొల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని దోనేపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తున్న మాధవి, జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్న వెంకట్రావులను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తరఫున జిల్లా అధ్యక్షులు శ్రీనివాసకుమార్ దుశ్శాలువాలు, పూల బొకేలతో సత్కరించారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసకుమార్

శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ రవివర్మ

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలక మండలి కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే నరేంద్రవర్మ ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. నూతన పాలక మండలి చైర్మన్‌గా పెనుమెత్స రవివర్మ, కమిటీ సభ్యులుగా పి.సూర్యనారాయణరాజు, టి.భాగ్యలక్ష్మీ, బి.మల్లేశ్వరి, ఎన్.లక్ష్మణస్వామి, వైవి.రమణరావు, డి.గిరికుమారి, కె.నరసింహమూర్తి, పి.పిచ్చమ్మలచే ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో శ్రీనివాసవర్మ, బాపట్ల డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి పర్యవేక్షించారు.



నూతన పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

సిట్ దర్యాప్తు సజ్జల కుటుంబానికి చావు దెబ్బే : కొల్లా

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కాంలో నేరగాడుగా సజ్జల భార్గవ్‌రెడ్డి సిట్ దర్యాప్తులో తేలటం సజ్జల కుటుంబానికి చావుదెబ్బేనని సంగం డెయిరీ మాజీచైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. మద్యం రవాణా కాంట్రాక్టుదారు సంస్థకు చెందిన బడా ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డితో భార్గవరెడ్డికి ఉన్న సంబంధాలు కూడా ఈ దర్యాప్తులో బట్టబయలు కావటం సజ్జల కుటుంబానికి చావుదెబ్బ అయ్యిందని కొల్లా పేర్కొన్నారు.

వైద్యకళాశాలను ప్రభుత్వ నిధులతోనే నిర్మించాలి : బీఎస్పీ

బాపట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వైద్యకళాశాలను ప్రభుత్వ నిధులతోనే నిర్మించాలని బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజారావు డిమాండ్ చేశారు. మనబాపట్ల-మన వైద్యకళాశాల అనే నినాదంతో శుక్రవారం బాపట్ల పట్టణంలో ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, గడ్డం ఏలియా, జోసఫ్, కె.రాజారావు, ఎన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఈగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావు

రేపల్లె, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ పట్టణ ఏఈగా మోర్ల వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఉన్న విద్యుత్ సమస్యలను అధ్యయనం చేసుకుని మెరుగుపరిచే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఏ శ్యామ్‌సుధాకర్‌బాబు, పరిశా వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

భాగవత సప్తాహంలో శ్రీకృష్ణజననం, లీలలపై ప్రవచనాలు

కొల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : 109వ శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవాలలో శ్రీకృష్ణుని జననం, లీలలపై పండితులు ప్రవచించారు. కొల్లూరులో జరుగుతున్న శ్రీమద్భాగవత సప్తాహ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం యదువంశ వర్ధనం, శ్రీకృష్ణ జననం, శ్రీకృష్ణలీలలు, బృందావన విహారం, గోవర్ధనోద్ధరణం, రసపంచధ్యాయి, కంసోద్ధరణములపై సుదీర్ఘంగా తంగిరాల రాజేంద్రప్రసాద్ శర్మ ప్రవచనం చేయగా భక్తులు శ్రవణానందం పొందారు. అనంతరం శంకర సేవా సమితి కార్యదర్శి కల్లూరి వెంకటసూర్యనారాయణమూర్తి చిన్నికృష్ణుని బుట్టలో మోసుకువచ్చి ఉయ్యాలలో వేయగా భక్తులు పరవశించారు. శనివారం రుక్మిణి కల్యాణం జరుగుతుందని, ఆ కల్యాణ కార్యక్రమాన్ని నైషదం వెంకటరామ్మూర్తి, మంజుల దంపతులు నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. సప్తాహం అనంతరం భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.



చిన్నికృష్ణుని ప్రతిమను ఉయ్యాలలో వేసేందుకు తీసుకు వస్తున్న భక్తులు

గోశాలకు తరలించిన గోవులు

రేపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతూ ప్రమాదాలకు నిలయంగా మారటంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి గోవులను పట్టుకుని తెనాలి, గుంటూరులోని గోశాలకు తరలిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. గోయజమానులకు పలుమార్లు తెలియజేసినా పట్టించుకోకపోవటంతో గోవులను పట్టుకుని లారీల ద్వారా గోశాలకు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆవులను గోశాలకు తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

చుండూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పది మంది అనారోగ్య బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గుంటూరు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాధిత కుటుంబాలకు అందించారు. మోదుకూరుకు చెందిన కొలసాని వీరాంజనేయులు రూ.84 వేలు, మేడిద ఆనంద్ రూ.66 వేలు, ఆళ్ల పద్మజ రూ.45 వేలు, పటాలం పార్వతి రూ.25 వేలు, పెదగాదెలవర్రుకు చెందిన బద్దెపూడి పోలయ్య రూ.30 వేలు, కేశమనేని సీతామహాలక్ష్మీ రూ.15 వేలు, చినగాదెలవర్రుకు చెందిన కొనతాల శ్రీనివాసరావు రూ.23 వేలు, ఆలపాడుకు చెందిన చావలి నగేష్‌బాబు రూ.65 వేలు, వలివేరుకు చెందిన నూతలపాటి రాజు రూ.27 వేలు, దుండిపాలెంకు చెందిన దుగ్గిరాల సునీత రూ.23 వేలు వంతున వైద్య ఖర్చుల నిమిత్తం అందిన మొత్తం రూ.4 లక్షల విలువైన చెక్కులను ఆనందబాబు పంపిణీ చేశారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరించాలి

రేపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్‌ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఈద్గా అధ్యక్షుడు షేక్ జమీర్ అన్నారు. పట్టణంలో ఈద్‌మిలాన్‌ఉన్‌నబీ పండుగ సందర్భంగా ముస్లింలు శుక్రవారం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజాన్ని శాంతివైపు నడిపించిన మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఈపండుగ చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో షేక్ ఖాదర్‌భాషా, షేక్ మొహీద్దీన్, లియాఖత్‌భాషా, రుక్షా, ఆరీఫ్, షేక్ నాగూర్, కరిముల్లా, షేక్‌మొబీన్, గౌస్మా, ఈద్గాపెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.



ఈద్‌మిలాన్‌ఉన్‌నబీ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిలు

- వేమూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లో ఉన్న ముస్లింలు మిలాద్ నబీ పండుగను భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. గురువారం పూర్తిగా జాగరణ జరిపి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. జంపని గ్రామంలో ఆస్థాన అతా ఏబాగ్ ఏ సర్కార్ తాజుల్ ఔలియా దర్బార్ వ్యవస్థాపకులు సబ్జా దాఅల్ ఖాదరియా మహ్మద్ నిజాముద్దీన్ నిజామీషా తాజ్ ఖాదరిబాబా ఆధ్వర్యంలో తాజుల్ ఔలియా దర్బార్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పది వేల మందికి అన్నదానం చేశారు. పలు గ్రామాల నుంచిముస్లిం పెద్దలు కుటుంబాల వారు దర్బారుకు విచ్చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న మహ్మద్ నిజాముద్దీన్ నిజామిషా తజ్ ఖాదర్ బాబా

- కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కొల్లూరులోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జెండా చెట్టు వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముస్లింలతో పాటు హిందువులు పాల్గొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. భట్టిప్రోలు మండలంలోని భట్టిప్రోలు, అద్దేపల్లి, వెల్లటూరు, పల్లెకోన, వేమవరం తదితర గ్రామాల్లో ముస్లింలు మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కౌలు రైతులకు రక్షణ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.జమలయ్య

రేపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని శుక్రవారం డిమాండ్ చేశారు. మండలంలోని ఊలుపాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు పెనుమూడి హరీష్ పొన్నూరు సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన మాగాణి భూమి 3.07 ఎకరాలను 2019 నుంచి కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్నాడని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామం పెత్తందారులు దేవదాయశాఖ అగ్రిమెంట్ ప్రకారం హరీష్ సాగు చేసుకుంటున్న కౌలుభూమిని దౌర్జన్యంగా బెదిరించి ఇతరుల చేత ఆ భూమిని సాగు చేయిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి కౌలు రైతు హరీష్‌కు న్యాయం జరగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గొట్టుముక్కల బాలాజీ, పి.నాగాంజనేయులు, బాధితుడు హరీష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ

భట్టిప్రోలు (కొల్లూరు) సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రానికి నాలుగు కుర్చీలను దాతలు అందించారు. శుక్రవారం భట్టిప్రోలులోని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, యునెస్కో అవార్డు గ్రహీత బొలిశెట్టి శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు, ప్రమీలారాణిలు ఆఫీషియల్ విజిట్ సేవా కార్యక్రమంలో భాగంగా కుర్చీలను గవర్నర్ చేతుల మీదుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు బూరెల చంద్రశేఖర్, నంబూరు నాగభూషణరావు, సిహెచ్ ఉమామహేశ్వరరావు, కె.రవికుమార్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కేసు

కర్లపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మల పల్లికి చెందిన ఓ మహిళతో ముగ్గురు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. గత నెల 31వ తేదీ రాత్రి వీధి బయట అదే గ్రామానికి చెందిన మల్లారపు శ్రీనివాసరావు, దుర్గారెడ్డి, మరో గుర్తుతెలియని వ్యక్తి ఆ మహిళ తో అసభ్యంగా ప్రవర్తించారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.

పడిపోయిన పరపతి

(5వ పేజీ తరువాయి)

వర్సిటీని ప్రక్షాళన చేయా ల్సింది పోయి ఓ ఉన్నతాధికారి అన్ని అంశాలకు అడ్డుగా ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం లోని అన్ని యూనివర్సిటీ లకు పూర్తి స్థాయి వీసీ నియామకానికి నోటిఫికేషన్ లు వచ్చాయి. ఒక్క ఎన్ జీ రంగా యూనివర్సిటీ మాత్రం నోటిఫికేషన్ నుంచి తప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పీఎం, సీఎం ఆలోచనలకు బ్రేక్‌లు..

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు పెద్ద పీట వేయాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. అందులో భాగంగానే నమో దీదీ పథకం ద్వారా డ్రోన్లు అందజేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా గ్రామాల్లోని రైతులను యూనివర్సిటీకి పిలిపించి డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని కొంతకాలం నిర్వహించారు. ఎప్పుడైతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి శిక్షణను అర్థాంతరంగా నిలిపివేశారు. ఇన్‌చార్జి వీసీ ఆదేశాలతోనే డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు తెలుస్తుంది. ఒకపక్క రైతులకు డ్రోన్లు పంపిణీ చేసి వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు భావిస్తూ ఉంటే మరో పక్క అందుకు భిన్నంగా వీసీ ఆదేశాల ఇవ్వడం చర్చనీయాంశంగా మారుతుంది.

అంతు చిక్కని మరణాలపై పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

అక్కడికి పరిస్థితులను తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి వెళ్లి ఇప్పటివరకు జరిగిన పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా బాధితుల ఇళ్లను సందర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న సేవల గురించి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి మంత్రులకు వివరించారు. మంత్రుల వెంట ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ జీ రఘునందన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఉన్నారు.

అపోహలను నమ్మవద్దు : పెమ్మసాని

అంతు చిక్కని జ్వరాలకు బ్లడ్ కల్చర్ పరీక్షల ఫలితాల తర్వాతే స్పష్టత వస్తుందని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సూడోమల్లీ బ్యాక్టీరియా కారణంగా వచ్చే మెలియాయిడోసిస్ జ్వరాలు గ్రామంలో ప్రబలినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. అయితే తాగునీరు ద్వారా ఈ వ్యాధి రాదన్నారు. అపోహలను నమ్మవద్దన్నారు. అరుదైన వ్యాధి కావడం ఎవరికీ సరైన అవగాహన లేకపోవడం, తెలుసుకునేందుకు కొంత సమయం పడుతుందని తెలిపారు. ఇది సర్వ సాధారణంగా కనిపించే వ్యాధి కాదని, తాను డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసిన సమయంలో కూడా ఇలాంటి వ్యాధిని చూడలేదన్నారు. పూర్తిస్థాయిలో వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరమే మెలియాయిడోసిస్ వ్యాధి గురించి తేల్చి చెప్పగలమని ఆయన అభిప్రాయపడ్డారు. బ్లడ్ కల్చర్ రిపోర్టులు శనివారం వెల్లడించే అవకాశం ఉంది. ఈ ఫలితాలు వస్తేనే తురకపాలెంలో ఇన్ఫెక్షన్‌కు దారి తీసిన కారణాలపై స్పష్టత వస్తుందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారు.

ప్రైవేటు వైద్యనిపుణుల సాయం...

తురకపాలెంలో ప్రబలిన అంతుపట్టని వ్యాధుల నిర్ధారణకు గుంటూరులోని కొందరు ప్రైవేటు వైద్యనిపుణుల సాయం తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లైన వీరు ఆరోగ్య శాఖను సమన్వయం చేసుకుని రోగుల వ్యాధి నిర్ధారణలో తమ వంతు సాయం అందిస్తారు. దీనికి సంబంధించిన విధి విధానాలు ఒకటి, రెండు రోజుల్లో వెలువరిస్తారు.

బంగారం!

● పెట్టుబడిదారుల చూపుతో.. సామాన్యులకు దూరం

● వారంలో 24 క్యారెట్ల గ్రాము ధర రూ.1000 పెరుగుదల

● పది గ్రాములు రూ.1.11లక్షలకు చేరువ

● శ్రావణ మాసంలోనూ కొనుగోలుకు ప్రజలు దూరం

గుంటూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బంగారం అంటే ప్రతి ఒక్కరికీ మోజే.. సంపన్నులు మొదలు రోజువారీ కాయకష్టం చేసుకునేవారి వరకూ ప్రతి ఒక్కరూ పసిడిని ధరించాలని కోరుకుంటారు. అందుకే ఎంతోకొంత మిగలితే బంగారం కొనుక్కుందామనుకుంటారు. చిన్నా చితకా ఆభరణం చేయించుకుని మురిసిపోతుంటారు. గత కొంతకాలంగా బంగారంపై సామాన్యుల ఆశలు ఆవిరైపోతున్నాయి. అందుకు కారణం అసాధారణంగా పెరుగుతున్న పసిడి ధరలే! గడిచిన వారం రోజుల్లో పరిస్థితి మరింత మారిపోయింది. శ్రావణ మాసం ముగిసిన బంగారం ధరలు పెరుగుతుండడంతో ఆభరణాలు కొనుగోలుకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు.



వారంలో 10 శాతం పెరుగుదల

సరిగ్గా వారం రోజుల్లో బంగారం ధర 10 శాతం పెరిగింది. వారం రోజుల క్రితం వరకూ రిటైల్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ఒక గ్రాము రూ.10వేలు ఉండగా ప్రస్తుతం రూ.11వేల మార్కును దాటింది. బులియన్ మార్కెట్లో వారం రోజుల క్రితం వరకూ లక్ష రూపాయలు ఉన్న 10 గ్రాముల బంగారం ధర శుక్రవారం నాటికి రూ. లక్షా 11 వేల మార్కును చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర గ్రాము రూ.10,150, 10 గ్రాములు రూ. లక్షా 1,500లు పలుకుతోంది. బంగారంతో పాటు వెండి ధర కూడా అనూహ్యంగా పెరుగుతోంది. ప్రస్తుతం కిలో వెండి ధర కూడా 1.28 లక్షలకు చేరువయింది. బంగారం అండర్ సేల్‌లో చూసుకున్నా రూ.1.09 లక్షలకు తక్కువకు బంగారం దొరకడం లేదు. దీంతో చాలా మంది బంగారం జోలికి వెళ్లడానికి భయపడుతున్నారు.

20 నెలల్లో రెట్టింపు..

వాస్తవానికి 2023 చివరి నాటికి గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర రూ.6 వేలుగా ఉండేది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.75వేలకు చేరింది. జూలైలో కేంద్ర బడ్జెట్ పుణ్యమా అని బంగారం ధర ఒక్కసారిగా రూ.70 వేలకు తగ్గింది. మళ్లీ ఆగస్టు వచ్చే నాటికి రూ.75వేలకు పెరిగింది. ఏడాది తిరిగే సరికి ఆ ధర రూ.లక్షా 11 వేలకు చేరింది. 20 నెలల కాలంలోనే ఇలా రెట్టింపు ధర పెరగడంతో బంగారం జన సామాన్యానికి దూరమవుతూ వస్తోంది.

అంతర్జాతీయ పరిణామాలే కారణం

బంగారం ధరలు భారీగా పెరగడానికి అంతర్జాతీయంగా నెలకొన్నటువంటి పరిస్థితులు ప్రధాన కారణంగా చెబుతున్నారు. స్టాక్ మార్కెట్లలో నష్టాలు నెలకొన్న నేపథ్యంలో బంగారం ధరలు అమాంతం పెరిగాయని అంటున్నారు. స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ఉండడంతో మదుపర్లు బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారని, ఆ కారణంగా బంగారం ధర పెరుగుతోందని అంటున్నారు. దీనికి తోడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు కూడా బంగారం ధరపై ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయంగా గమనించినట్లయితే బంగారం ధరలు అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ మార్కెట్లో ఒక ఔన్స్ బంగారం ధర 3,579 డాలర్లకు చేరుకుంది. మరోవైపు డాలర్ ధర కూడా పడిపోతుండడంతో బంగారం ధరకు కాళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. పెద్ద పెద్ద పెట్టుబడిదారులంతా తమ నగదును బంగారం రూపంలోకి మార్చుకుంటుండడంతో బంగారం మొత్తం ఒకే చోట పోగుపడుతోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో ప్రస్తుతం బంగారం ధర ఆల్ టైం రికార్డ్ స్థాయికి చేరింది. ఈ పెరుగుదల ఎంతవరకూ ఉంటుంది, ఎప్పుడు ఆగుతుంది అనేది తెలియడం లేదు.

ఆభరణాలపై సన్నగిల్లిన ఆశలు

ధర అనూహ్యంగా పెరుగుతుండడంతో సామాన్యులు ఎవరూ బంగారు ఆభరణాల జోలికి వెళ్లడం లేదు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల్లో సైతం లాంఛనంగా ఇచ్చిపుచ్చుకునే బంగారు ఆభరణాల వ్యయాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గతంలో పెళ్లిళ్లలో వధూవరులకు చైన్లు, కంఠాభరణాలు చేయించేవారు. ఇప్పుడు ఉంగరాలతో సరిపుచ్చుకుని, లాంఛనాలన్నీ నగదు రూపంలోనే చెల్లించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వర్ణకారులకు పని తగ్గిపోయింది. ధరలు స్థిరపడితే కొంతమేర పనులు పెరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు. కిందటి నెల శ్రావణ మాసం అయినప్పటికీ బంగారు ఆభరణాలు చేయించుకున్నవారు చాలా పరిమితంగా ఉన్నారని స్వర్ణకారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మంగళగిరి, తెనాలి, విజయవాడ తదితర ప్రాంతాల్లో స్వర్ణకార వృత్తి చేసుకునే వేలాది మంది జీవనోపాధి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

ఎరువులు ఏమవుతున్నాయ్..

(5వ పేజీ తరువాయి)

అధికారులు చెప్పారు. అయితే ఇప్పటికీ యూరియా వెతలు వెంటాడుతూనే ఉన్నాయి. సీజన్ మొత్తానికి కావాల్సిన ఎరువుల్లో ఇప్పటికే 60 శాతం పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. మొత్తం విస్తీర్ణంలో 70 శాతం సాగు కూడా ఇంకా పట్టాలెక్కలేదని ఈ-క్రాప్ లెక్కలే చెబుతున్నాయి. గుంటూరు జిల్లాలో 5125, పల్నాడులో 9132, బాపట్లలో 6789 టన్నుల యూరియా నిల్వలు అందుబాట్లో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. అయితే యూరియా కోసం ఇక్కట్లు ఎందుకు వచ్చాయనే దానికి అధికారుల నుంచి సమాధానం లేదు. ఇప్పుడు తెచ్చుకోకపోతే యూరియా ఇక బయట దొరకదు అనే విధంగా తప్పుడు ప్రచారం జరగడం, దానిని నమ్మడం కూడా ప్రస్తుత పరిస్థితికి ఓ కారణంగా ఉంది. యూరియా పంపిణీలో రాజకీయ జోక్యం కూడా రైతుల ఇక్కట్లుకు ఒక కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు డీలర్లతో కొంతమంది ఉద్యోగులు కుమ్మక్కు కావడంతో బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం పంపిణీపై అధికారులు దృష్టి పెట్టకపోవడం కూడా సమస్య తీవ్రతరం కావడానికి కారణంగా కనబడుతోంది.

పంపిణీపై లెక్కలేవీ..

ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 18 వేల నుంచి 20 వేల టన్నుల యూరియా సొసైటీల్లో పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ ఇందుకు సంబంధించి ఏయే సొసైటీల్లో ఎంతమంది రైతులకు ఇచ్చారనే లెక్కలు కొరవడ్డాయి. ఇక్కడే చాలావరకు పక్కదారి పట్టాయని రైతులు ఆరోపిస్తున్నారు. నేతలు చెప్పినవారికే భారీ యూరియా నిల్వలు



పొందుగుల చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

తరలించారని, దీంతో చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. ఇదిలా ఉంటే ప్రారంభంలో యూరియా పంపిణీ విషయంలో లెక్కాపత్రాలేవీ లేకుండానే ఒక్కొక్కరికి 30 నుంచి 50 బస్తాల వరకు ఇవ్వడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణంగా కనిపిస్తుంది. ప్రభుత్వం భారీ స్థాయిలో యూరియా కేటాయించినట్లు గణాంకాలు ధ్రువీకరిస్తుండగా, కొద్దిమంది వద్దకే ఆ నిల్వలు చేరడమే ఈ కటకటకు కారణంగా ఉంది. యూరియా విషయంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని అంచనా వేయలేకపోయిన అధికారులు ప్రారంభంలో పంపిణీని పట్టించుకోలేదు. స్థానికంగా ఉండే నేతల మీదనే వదిలేశారు. దీంతో వారు దీనిని అవకాశంగా చేసుకుని సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. శాస్త్రీయంగా చూస్తే ఎకరానికి ఇప్పటి వరకు రెండు యూరియా బస్తాలను రెండు దఫాలుగా రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఈ నెలాఖరుకు ఇంకోసారి నిబంధనల ప్రకారం అందించాలి. అది కూడా సదరు రైతు తంబ్ వేయించుకున్నాకే. కానీ వీటిని వదిలేసి ఒక్కొక్కరికి రెండు టన్నులు కూడా ఇచ్చారని, ఇదే సమయంలో బ్లాక్ మార్కెట్‌కు కొంత తరలించడంతో అందరి ప్రయోజనం కాస్తా కొద్ది మందికే పరిమితమైనట్లు తెలుస్తోంది.

సమన్వయ లోపం కూడా కారణమే...

యూరియా ఇక్కట్లకు సంబంధించిన సంకేతాలు దాదాపు మూడు వారాల క్రితమే కనిపించాయి. అప్పుడే అప్రమత్తమవ్వాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. అందువల్లే ఇప్పుడు పరిస్థితి తీవ్రతరమైందని తెలుస్తోంది. వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, విజిలెన్స్‌తో పాటు రెవెన్యూ, పోలీస్ విభాగాలు కూడా సమన్వయంతో అడుగులు వేసి ఉంటే యూరియా పక్కదారి పట్టకుండా చాలా వరకు నియంత్రించగలిగే వారు. కానీ ఆయా విభాగాల మధ్య సమాచార లోపంతో పాటు బాధ్యతల విషయంలో స్పష్టత లేకుండా వ్యవహరించడం కూడా పరిస్థితి అదుపు తప్పడానికి కారణమైందన్న విమర్శలు వస్తున్నాయి.

రైతుల మధ్య ఘర్షణలు..

యూరియా నిల్వలు వచ్చాయని తెలిస్తే ఆర్ఎస్కేలు, సొసైటీల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో రైతుల మధ్య ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రేపల్లె మండలం నల్లూరుపాలెంలో ఎరువుల కోసం శుక్రవారం రైతులు ఎగబడటంతో చిన్నపాటి గొడవలు జరిగాయి. పోలీసులు దగ్గరుండి క్రమ పద్ధతిలో రైతులకు యూరియాను అందించాల్సి వచ్చింది. పలుకుబడి ఉన్నవారు ఐదు, పదికట్టలు క్యూలో నుంచోకుండా తీసుకువెళ్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొంత మంది దళారులు, పీఏసీఎస్ అధ్యక్షులు అధిక ధరలకు యూరియాను అమ్ముకుంటున్నారంటున్నారు.



నీల కంఠం..చుట్టూ నీళ్లు..!

దాచేపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది వర వళ్లు తొక్కుతోంది. తీర ంలోని లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలను ముంచెత్తుతోంది. పనిలో పనిగా నది ఒడ్డున ఉన్న పరమేశ్వరుడిని ఆక్రమించేసింది. మండలంలోని కాట్రపాడు గ్రామ సమీపంలో కృష్ణా నది పుష్కరాల సమయంలో పుష్కర్ ఘాట్ నిర్మించారు. పరమేశ్వరుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. నాగార్జున సాగర్ డ్యాం నుంచి విడుదలైన వరద నీరు, పులిచింతల డ్యామ్ బ్యాక్ వాటర్‌తో ఒడ్డున ఉన్న శివయ్య నీల కంఠం వరకు నీళ్లొచ్చాయి. ఈ చిత్రాన్ని స్థానికులు తన మొబైల్ ఫోన్లలో బంధించి.. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు.

పీ-4 ఫలించింది.. వృద్ధురాలి ఇంటికి పునాది పడింది



నాగేశ్వరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పీడీ బండారు శివలింగం

పిడుగురాళ్ల/రాజుపాలెం, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): పీ-4 పథకంతో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఓ వితంతు మహిళకు గృహం మంజూరైంది. రాజుపాలెం మండలం నెమలిపురి గ్రామానికి చెందిన మొండితోక నాగేశ్వరమ్మ ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అదే గ్రామానికి చెందిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన రామయ్య నాగేశ్వరమ్మకు పీ-4 పథకంతో గృహం మంజూరు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు లేఖరాశారు. దీంతో స్పందించిన కలెక్టర్.. నాగేశ్వరమ్మకు గృహాన్ని మంజూరు చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ బండారు శివలింగం నెమలిపురి ఎస్సీ కాలనీలో నాగేశ్వరమ్మ గృహనిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డీఈ వెన్నపూస శ్రీనివాసరెడ్డి, రాజుపాలెం, బెల్లంకొండ హౌసింగ్ ఏఈలు చంద్రశేఖర్, జోగారావు పాల్గొన్నారు.

62వ జాతీయ చదరంగం చాంపియన్‌షిప్ లోగో ఆవిష్కరణ

గుంటూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి అక్టోబరు 1 వరకు గుంటూరులోని విజ్ఞాన విశ్వవిద్యాలయంలో జరగబోయే 62వ జాతీయ చదరంగం చాంపియన్‌షిప్-2025 లోగోని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీనరసింహ ఆవిష్కరించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, విశ్రాంత న్యాయమూర్తి డీవీఎస్ సోమయాజులు, డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య డాక్టర్ డీ సూర్యప్రకాశరావు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్, సెక్రెటరి కె.జగదీష్, ముఖ్య సలహాదారు కేవీవీ శర్మ పాల్గొన్నారు.



లోగోని ఆవిష్కరిస్తున్న ఎస్సీ న్యాయమూర్తి శ్రీనరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్

సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని మోసం

● రూ.70 వేలు తీసుకున్న దళారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని నమ్మించి మోసగించిన ఓ దళారీని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లాలోని వెంగలాయపాలెంకు చెందిన హరి నాగసాయి కార్తీక్ కొన్నేళ్లుగా భక్తులను మోసగిస్తూ అందినవరకు దోచుకుంటున్నాడు. ఇటీవల ఫేస్‌బుక్‌లో 'శ్రీప్రభాకర చార్యులు' అనే నకిలీ ఖాతాను తెరిచాడు. తాను తిరుమలలో సహాయ అర్చకుడినని, బ్రేక్ దర్శనాలు, ఆర్జిత సేవ టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి మోసం చేయడం మొదలుపెట్టాడు. ఆదిత్య, హరికృష్ణ, నాగార్జున అనే మరో ముగ్గురి సహాయంతో బ్యాంకు ఖాతాలు కూడా తెరిచాడు. ఈ ముఠా తిరుపతికి చెందిన విజయ్ అనే భక్తుడికి నాలుగు సుప్రభాతసేవ టికెట్లు ఇప్పిస్తామని చెప్పి రూ.70,070 తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్‌బాబు, చలపతి ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుమలలోని కర్ణాటక సత్రాల వద్ద కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్దనున్న రూ.1.03 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీన పరుచుకున్నారు. ఇప్పటికే కార్తీక్‌పై తిరుమల వన్‌టౌన్, టూటౌన్‌లో రెండు కేసులు, తిరుపతి ఈస్ట్‌లో మరో కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే 16 మంది ఎన్ఆర్ఐ భక్తులకు అభిషేకం టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.36 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో జైలుకు వెళ్లి.. బెయిల్‌పై వచ్చిన కార్తీక్.. మళ్లీ భక్తులను మోసగించడం మొదలు పెట్టాడని పోలీసులు తెలిపారు.



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు డాక్టర్.జె.ప్రతాప్, తిమ్మాయిపాలెం జడ్పీ, బాపట్ల

మాస్టార్లకు ఘన సత్కారం

గురువులకే గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విజయవాడలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం 175 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్లుగా గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌లు పేరుపేరునా సత్కరించారు. విద్యాశాఖలో 78 మంది ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్‌లో 26 మంది జూనియర్ లెక్చరర్లు, ఉన్నత విద్యలో 56 మంది ప్రొఫెసర్లు, డిగ్రీ లెక్చరర్లు, పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 మంది లెక్చరర్లను ఉత్తమ టీచర్లుగా గుర్తించి అవార్డులు ప్రదానం చేశారు.

- అమరావతి



కె.మోహనాంజలి, మక్కెనవారిపాలెం జడ్పీ, బాపట్ల



ఎం.ధనలక్ష్మి, ఎంపీయూపీ అద్దంకి



బి.శివకుమారి, నకరికల్లు జెడ్పీహెచ్‌ఎస్



ఎం.పార్వతి, ఎస్‌బీపురం జడ్పీ హెచ్‌ఎస్



సునీత రాణి, ఎస్ఎస్ఎన్ఓ, గుంటూరు



జి.సుశీల మాధవి, పీఎంసీ హెచ్‌ఎస్, గుంటూరు



డాక్టర్.ఎ.భద్రావతి ఎంపీపీ మోడల్ చెల్లిపాలెం



బి.లక్ష్మణరావు, జీజేసీ, చేబ్రోలు



ఎ.లక్ష్మీదేవి, జీపీసీ, దుర్గి



ఎ.లావణ్య, ఎస్ఎం జీపీసీ(జీ), బాపట్ల



సీహెచ్ మోసెస్ అరవింద్, ఎంబీటీఎస్ పాలిటెక్నిక్



ఆర్.ప్రకాశరావు, ఎంబీటీఎస్ పాలిటెక్నిక్



వి.నగేశ్‌బాబు, పాలిటెక్నిక్, పొన్నూరు



ప్రొ.సూర్యదేవర విద్యాధర, చేబ్రోలు హనుమయ్య, ఫార్మసీ



ప్రొ.పి.శ్రీనివాసబాబు, విజ్ఞాన్ ఫార్మసీ



ప్రొ. తలశిల ఈశ్వర గోపాల కృష్ణమూర్తి, బాపట్ల ఫార్మసీ



డాక్టర్. పి.హేమలత, జేఎంజే కాలేజ్ ఉమెన్స్



ప్రొ.గుజ్జు చెన్నారెడ్డి, ఏఎన్‌యూ



ప్రొ.పిపిఎస్.పాల్ కుమార్,ఏఎన్‌యూ



ప్రొ.వి.దివ్యతేజో మూర్తి, ఏఎన్‌యూ



డాక్టర్ పి. సుధాకర్,ఏఎన్‌యూ



ప్రొ.ఆర్.రమేష్‌రాజు, ఏఎన్‌యూ



ప్రొ.కె.జయలలిత, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ



ప్రొ.లాల్ అహ్మద్ మొహ్మద్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ



ప్రొ డి.సుబ్రహ్మణ్యం, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ



వై.రాజ్యలక్ష్మి, ఎంపీపీఎస్, కనపర్రు

గురువులకు ఘన సత్కారం



గురువులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

● చీరాలలో ఉపాధ్యాయ దినోత్సవం ● కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న వీరాంజనేయులు

చీరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో గురువులను మించిన దైవం లేదని, వారి సూచనలు తప్పక పాటించి ఉన్నత గమ్యాలు చేరుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య దశ నుంచి ఆచరించ వలసిన అంశాలను వివరించారు. పుల్లెల సుబ్రహ్మణ్యం, ముట్టే వెంకటేశ్వర్లు(ఎంవీ), వెంకట రమణారావు, నాగమల్లేశ్వరరావు, మన్నెం వెంకటశ్వరరావులను ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు.

బత్తుల సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో

బత్తుల సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక వైఎ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ ఎండీ మొయిన్, మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు హాజరయి సమాజంలో ఉపాధాయుల ఔన్నత్యాన్ని చాటారు. 10 మందికి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తి, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని నలుగురు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు అందుకున్నారు. శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి అవార్డులు దక్కాయి. వీరిలో వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయినీగా పనిచేస్తున్న జరుబుల శ్రావణి, బూసం లలితాంబ, వడ్డె సంఘం ఎంపీపీ పాఠశాలకు చెందిన పోపూరి రంగారావు, నాయనిపల్లి(ఈస్ట్) ఎంపీపీ పాఠశాలకు చెందిన తెలగతోటి ఇందిర ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈక్రమంలో మండల పరిధిలోని పలువురు ఉపాధ్యాయులు వీరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

వీరాంజనేయులుకు పురస్కారం

బల్లికురవ : మండలంలోని కొప్పెరపాలెం ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గాలం వీరాంజనేయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటమురళి, డీఈవో పురుషోత్తం చేతుల మీదుగా అందుకున్నారు. గత 17 ఏళ్ల నుంచి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పలువురు విద్యార్థులను తీర్చి దిద్దడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను జిల్లా అధికారులు గుర్తించి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గాలం వీరాంజనేయులుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన వీరాంజనేయులను యూటీఎఫ్ నేతలు, వినయ్, అడుగుల శ్రీనివాసరావు, దూళిపాళ్ల శేషగిరి, సంపతి శ్రీనివాసరావు, కోటి నాగులు, చంటి శ్రీనివాసరెడ్డి, బొప్పుడి శ్రీనివాసరావు, చెన్నారెడ్డి, మోషే మరియు పలువురు ఉపాధ్యాయులు, హెచ్ఎంలు అభినందనలు తెలిపారు.







మాట్లాడుతున్న డీఎస్పీ మోయిన్, అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు, ప్రశంసాపత్రం అందుకుంటున్న వీరాంజనేయులు

అవీ..ఇవీ..

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

పంగులూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటన 16వ నంబరు జాతీయరహదారిలో భగవాన్ రాజుపాలెం ఫ్లైఓవర్‌పై చోటుచేసుకొంది. శుక్రవారం తెల్లవారు జామున ప్రయాణికులతో బెంగుళూరు నుంచి వైజాగ్ వెళుతున్న బస్సు మండలం లోని భగవాన్‌రాజుపాలెం ఫ్లైఓవర్‌పై ముందువెళుతున్న లారీని ఢీకొంది ఈ ఘటనలో బస్సుడ్రైవర్‌కు గాయాలయ్యాయి. ప్రయాణికులు క్షేమంగా ఉన్నారు. గాయపడిన బస్సుడ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హైవేఅంబులెన్స్‌లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోటేశ్వరరావు మృతిపై ఆందోళన

● హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ



పేర్లి కోటేశ్వరరావు(ఫైల్)

పేరాల(చీరాల), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేరాల హరీస్‌పేటకు చెందిన పేర్లి కోటేశ్వరరావుది సహజ మరణం కాదని, ఆయన్ను ఉద్దేశ్య పూర్వకంగానే హత్య చేశారంటూ కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. భార్య ప్రియాంకతో చెరుకుపల్లిలో వస్త్రదుకాణం నిర్వహిస్తున్న కొద్దిరోజుల క్రితమే స్వగ్రామమైన పేరాలకు వచ్చాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు గానీ ఇంటి సమీపంలోని చిల్లచెట్లలో మృతి చెంది పడి ఉన్నాడు. దీనిపై అనుమానస్పద మృతిగా రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే దీనిపై కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. మద్యంమత్తులో తమ బిడ్డ మరణించినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని అన్నారు. ఘటనపై పారదర్శకంగా విచారించి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులుగా ఎంపికైన మహిళలకు అభినందన



పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న విద్యార్థులు

పంగులూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా డిఎస్‌సీలో ప్రతిభచాటి ఉపాధ్యాయులుగా ఎంపికైన ముగ్గురు మహిళా ఉపాధ్యాయులను రోటరీక్లబ్ ప్రతినిధులు అభినందించారు. పంగులూరుకు చెందిన పాటిబండ్ల పావని(ఎస్‌ఏ గణితం), దాసరి ప్రభావతి(ఎస్‌ఏ వృక్షశాస్త్రం), కొండమూరు గ్రామానికి చెందిన మోరబోయిన శిరీష(ఎస్‌జీటీ)గా ఎంపికయ్యారు. శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావు, హెచ్ఎం శ్రీనివాసరావు, క్లబ్ ప్రతినిధులు తాటిసుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, వడ్డవల్లి వీరనారాయణ, పోతిన ప్రసాద్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ప్రారంభం

● మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన రైతులు



మోటారును ప్రారంభిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

బల్లికురవ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలోని రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఒకేసారి ఏర్పాటు చేసి శుక్రవారం అద్దంకి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు ప్రారంభించారు. ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కొమ్మినేని వారిపాలేనికి చెందిన రైతులు కలిసి తమకు వ్యవసాయ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయలని కోరారు. దీంతో మంత్రి ఆదేశాలతో గ్రామంలోని 44 మంది రైతులకు సంబంధించి 10 విద్యుత్ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే అధికారులు ఏర్పాటు చేయించారు. ఎంతో కాలం నుంచి ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి తమకు పంటల సాగు సమయంలో కనెక్షన్లు మంజురు చేశారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఏడీ సూరేంద్రాబు, ఏఈ శ్రీనివాసరావు, గ్రామ సొసైటీ అధ్యక్షులు కొమ్మాలపాటి రామారావు, టీడీపీ నేతలు ఏల్చూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ అలివేలుమంగమ్మ మృతి



అలివేలుమంగమ్మ (ఫైల్)

పంగులూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామ మాజీ సర్పంచ్ పెంట్యాల అలివేలుమంగమ్మ(87) మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అలివేలుమంగమ్మ శుక్రవారం కన్నుమూశారు. అలివేలుమంగమ్మ 2006 నుంచి 2011 వరకు చందలూరు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆమె అంత్యక్రియలు శనివారం ఉదయం చందలూరులో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని 35 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు నల్లప్యాంట్, నల్ల టీ షర్టు ధరించి ఉన్నట్లు చెప్పారు.

సింగయ్యకు సత్కారం

సింగరాయకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటి ఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ నేత వేల్పుల సింగయ్యను శుక్రవారం ఆపార్టీ నేతలు అభినందించారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లోని ఆయన నివాసం వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సింగయ్య, ఆయన సతీమణి అయిన మాజీ సర్పంచ్ కోటేశ్వరమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కూనపరెడ్డి సుబ్బారావు, మాజీ వైస్ ఎంపీపీ హైమావతి, టీడీపీ నేతలు యస్థాని, కాక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు వైసీపీ నేతలపై కేసు

ముక్కుపచ్చలారని చిన్నారుల చేత రప్పా రప్పా ప్లకార్డుల ప్రదర్శనపై పోలీసుల చర్యలు

పొన్నలూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెడ్డి గారి ప్రభుత్వం వస్తే ఒక్కొక్కడికి రప్పా రప్పా.. నేడు మీది, రేపు మాది.. అంటూ రెచ్చగొట్టేలా వైసీపీ నేతలు వ్యవహరించిన తీరుపై పోలీసులు కన్నెర్ర చేశారు. ఆ పార్టీకి చెందిన ఏడుగురు నేతలపై కేసు నమోదు చేశారు. వైయస్ వర్ధంతి సందర్భంగా మండలంలోని పైరెడ్డిపాలెంలో వైసీపీ నేతలు కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ సహ పార్టీ నేతలు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం గణేష్ విగ్రహం దగ్గరకు ఊరేగింపుగా బయలుదేరిన నేతలు.. అధికార పార్టీని రెచ్చగొట్టేలా ప్లకార్డులు ప్రదర్శించారు. రెడ్డి గారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్కొక్కడికి రప్పా రప్పా.. నేడు మీది రేపు మాది అంటూ నినాదాలు కూడా చేశారు. చిన్నారుల చేత కూడా ప్లకార్డులు చేతబట్టించి రెచ్చగొట్టేలా నినాదాలు చేయించిన వైసీపీ నేతల తీరును గ్రామస్థులు తప్పుబడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో దారుణమైన పరిపాలన గుర్తుకు తెచ్చుకుని, రాష్ట్ర ప్రజలు 11 సీట్లు పరిమితం చేసినా వీరి వైఖరిలో ఏ మాత్రం మార్పు రాలేదని చర్చించుకున్నారు. వైసీపీ నేతల వ్యవహార శైలిపై స్థానికటీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ చేపట్టిన పోలీసులు ఏడుగురు నేతలపై కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన దుద్దుగుంట మల్లికార్జున రెడ్డి, కర్ల మస్తాన్ రెడ్డి, కదిరి సుధాకర్ రెడ్డి, కదిరి రవిరెడ్డి, కదిరి కృష్ణారెడ్డి, సిరిగిరి రామకృష్ణారెడ్డి, దారా చినరామయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనుక్ తెలిపారు.



ప్లకార్డులతో చిన్నారులు, మాజీ మంత్రి సురేష్, వైసీపీ నాయకులు

పడిపోయిన పరపతి

(5వ పేజీ తరువాయి)

వర్సిటీని ప్రక్షాళన చేయా ల్సింది పోయి ఓ ఉన్నతాధికారి అన్ని అంశాలకు అడ్డుగా ఉంటున్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం లోని అన్ని యూనివర్సిటీ లకు పూర్తి స్థాయి వీసీ నియామకానికి నోటిఫికేషన్ లు వచ్చాయి. ఒక్క ఎన్ జీ రంగా యూనివర్సిటీ మాత్రం నోటిఫికేషన్ నుంచి తప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పీఎం, సీఎం ఆలోచనలకు బ్రేక్‌లు..

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు పెద్ద పీట వేయాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. అందులో భాగంగానే నమో దీదీ పథకం ద్వారా డ్రోన్లు అందజేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా గ్రామాల్లోని రైతులను యూనివర్సిటీకి పిలిపించి డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని కొంతకాలం నిర్వహించారు. ఎప్పుడైతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి శిక్షణను అర్థాంతరంగా నిలిపివేశారు. ఇన్‌చార్జి వీసీ ఆదేశాలతోనే డ్రోన్ పైలెట్ శిక్షణ కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు తెలుస్తుంది. ఒకపక్క రైతులకు డ్రోన్లు పంపిణీ చేసి వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు భావిస్తూ ఉంటే మరో పక్క అందుకు భిన్నంగా వీసీ ఆదేశాల ఇవ్వడం చర్చనీయాంశంగా మారుతుంది.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రకాశం జిల్లా నుంచి నలుగురు టీచర్లకు అవార్డులు అందజేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్



సీఎం బాబు, మంత్రి లోకేష్ చేతులమీదుగా అవార్డులు అందుకుంటున్న సరోజనీదేవి, ఈశ్వరమ్మ, భాస్కరరావు, సుధాకర్


విజయవాడ సిటీ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ప్రకాశం జిల్లాకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లు అవార్డులు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో మొగళ్లూరు జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న సరోజనీదేవి, వీసీపల్లి జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న ఈశ్వరమ్మ, తంగెళ్ల జడ్పీ హైస్కూలులో పనిచేస్తున్న భాస్కరరావు, తర్లుపాడు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుధాకర్‌లు ఉన్నారు.

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా రమాదేవి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఒంగోలు నియోజకవర్గం బీసీ సామాజిక వర్గానికి చెందిన తమ్మిశెట్టి రమాదేవిని నియమిస్తూ టీడీపీ అధిష్టానం ప్రకటించింది. గతంలో ఒంగోలు నగర మహిళ అధ్యక్షురాలిగా పనిచేసిన ఆమె గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మహిళా కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రకటించిన నామినేటెడ్ పదవులలో రమాదేవికి రాష్ట్ర వడ్డెర వెల్‌ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి లభించింది.

బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటా!

రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ సూర్యకల్యాణ చక్రవర్తి



సూర్యకల్యాణ్‌చక్రవర్తిని సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆ పార్టీ రాష్ట్ర సెల్స్ కో కన్వీనర్ సూర్యకల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా పార్టీ పదవి చేపట్టిన సూర్యకళ్యాణ్ చక్రవర్తిని జిల్లా బీజేపీ నేతలు భారీ గజమాల, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవన్, సంఘటన్ మంత్రి మధుకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు వచ్చిన పదవి పెద్ద బాధ్యతని, దానిని సక్రమంగా నిర్వర్తించేందుకు అందరిని కలుపుకుని పోతానని చెప్పారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా దానిని తీర్చేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పార్టీ అధిష్టానంతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు, ముఖ్యనాయకులు సూర్యకళ్యాణ్‌చక్రవర్తిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.నర్సింగరావు, బొద్దులూరి ఆంజనేయులు, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ కరస్పాండెంట్ సీవీ.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, డాక్టర్ జేవీ.నారాయణ, అశోక్‌రెడ్డి, అమరసింహం, తోగంటి శ్రీనివాసులు, యోగయ్యయాదవ్, బోడపాటి బ్రహ్మయ్య, ఎం.శ్రీనివాసరావు, కావూరి వాసు, నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

20మందికి కుక్కకాటు

కొమరోలు, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరోలు, తాతారెడ్డిపల్లి, పురుషోత్తంపల్లి, గోపానిపల్లి గ్రామాల్లో పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తూ 20మందిని కరచింది. ఆయా గ్రామాల్లోని రోడ్లపై వెళ్తున్న పిచ్చికుక్క కనపడిన వారిని ఇష్టంవచ్చినట్లు కరుస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి పిచ్చికుక్క కాటుకు గురైన బాధితులు కొమరోలు ప్రభుత్వవైద్యశాలకు వచ్చి వ్యాక్సిన్ వేయించుకున్నారని, 20మందికి టీకాలు వేశామని వైద్యసిబ్బంది తెలిపారు. తీవ్రంగా గాయాలకు గురైన నలుగురిని గిద్దలూరు ఏరియా వైద్యశాలకు పంపి హిమోగ్లోబిన్ వ్యాక్సిన్ వేయించారని తెలిపారు. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జనసేన కార్పొరేటర్ల గుజరాత్ టూర్..!

● 10న బాలినేని ఆధ్వర్యంలో విహారయాత్ర

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరపాలక సంస్థలోని జనసేన కార్పరేటర్లు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో విహారయాత్రకు సిద్ధమయ్యారు. ఈనెల 10 నుంచి 16వతేదీ వరకు గుజరాత్‌లోని ప్రముఖ ఆలయాలను సందర్శించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రయాణ ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఒంగోలు నుంచి ట్రైన్‌లో చెన్నై చేరుకుని, అక్కడ నుంచి విమానంలో అహ్మదాబాద్ చేరుకుంటారు. అక్కడే ఏడు పగళ్లు, ఆరు రాత్రులు ఉండేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు.

ఎరువులు ఏమవుతున్నాయ్..

(5వ పేజీ తరువాయి)

అధికారులు చెప్పారు. అయితే ఇప్పటికీ యూరియా వెతలు వెంటాడుతూనే ఉన్నాయి. సీజన్ మొత్తానికి కావాల్సిన ఎరువుల్లో ఇప్పటికే 60 శాతం పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. మొత్తం విస్తీర్ణంలో 70 శాతం సాగు కూడా ఇంకా పట్టాలెక్కలేదని ఈ-క్రాప్ లెక్కలే చెబుతున్నాయి. గుంటూరు జిల్లాలో 5125, పల్నాడులో 9132, బాపట్లలో 6789 టన్నుల యూరియా నిల్వలు అందుబాట్లో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. అయితే యూరియా కోసం ఇక్కట్లు ఎందుకు వచ్చాయనే దానికి అధికారుల నుంచి సమాధానం లేదు. ఇప్పుడు తెచ్చుకోకపోతే యూరియా ఇక బయట దొరకదు అనే విధంగా తప్పుడు ప్రచారం జరగడం, దానిని నమ్మడం కూడా ప్రస్తుత పరిస్థితికి ఓ కారణంగా ఉంది. యూరియా పంపిణీలో రాజకీయ జోక్యం కూడా రైతుల ఇక్కట్లుకు ఒక కారణంగా పలువురు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు డీలర్లతో కొంతమంది ఉద్యోగులు కుమ్మక్కు కావడంతో బ్లాక్ మార్కెట్‌కు యూరియా తరలినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం పంపిణీపై అధికారులు దృష్టి పెట్టకపోవడం కూడా సమస్య తీవ్రతరం కావడానికి కారణంగా కనబడుతోంది.

పంపిణీపై లెక్కలేవీ..

ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 18 వేల నుంచి 20 వేల టన్నుల యూరియా సొసైటీల్లో పంపిణీ జరిగినట్లు మార్క్‌ఫెడ్ చెబుతోంది. కానీ ఇందుకు సంబంధించి ఏయే సొసైటీల్లో ఎంతమంది రైతులకు ఇచ్చారనే లెక్కలు కొరవడ్డాయి. ఇక్కడే చాలావరకు పక్కదారి పట్టాయని రైతులు ఆరోపిస్తున్నారు. నేతలు చెప్పినవారికే భారీ యూరియా నిల్వలు తరలించారని, దీంతో చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. ఇదిలా ఉంటే ప్రారంభంలో యూరియా పంపిణీ విషయంలో లెక్కాపత్రాలేవీ లేకుండానే ఒక్కొక్కరికి 30 నుంచి 50 బస్తాల వరకు ఇవ్వడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణంగా కనిపిస్తుంది. ప్రభుత్వం భారీ స్థాయిలో యూరియా కేటాయించినట్లు గణాంకాలు ధ్రువీకరిస్తుండగా, కొద్దిమంది వద్దకే ఆ నిల్వలు చేరడమే ఈ కటకటకు కారణంగా ఉంది. యూరియా విషయంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని అంచనా వేయలేకపోయిన అధికారులు ప్రారంభంలో పంపిణీని పట్టించుకోలేదు. స్థానికంగా ఉండే నేతల మీదనే వదిలేశారు. దీంతో వారు దీనిని అవకాశంగా చేసుకుని సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. శాస్త్రీయంగా చూస్తే ఎకరానికి ఇప్పటి వరకు రెండు యూరియా బస్తాలను రెండు దఫాలుగా రైతులకు ఇవ్వాల్సి ఉంది. ఈ నెలాఖరుకు ఇంకోసారి నిబంధనల ప్రకారం అందించాలి. అది కూడా సదరు రైతు తంబ్ వేయించుకున్నాకే. కానీ వీటిని వదిలేసి ఒక్కొక్కరికి రెండు టన్నులు కూడా ఇచ్చారని, ఇదే సమయంలో బ్లాక్ మార్కెట్‌కు కొంత తరలించడంతో అందరి ప్రయోజనం కాస్తా కొద్ది మందికే పరిమితమైనట్లు తెలుస్తోంది.

సమన్వయ లోపం కూడా కారణమే...

యూరియా ఇక్కట్లకు సంబంధించిన సంకేతాలు దాదాపు మూడు వారాల క్రితమే కనిపించాయి. అప్పుడే అప్రమత్తమవ్వాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. అందువల్లే ఇప్పుడు పరిస్థితి తీవ్రతరమైందని తెలుస్తోంది. వ్యవసాయశాఖ, మార్క్‌ఫెడ్, విజిలెన్స్‌తో పాటు రెవెన్యూ, పోలీస్ విభాగాలు కూడా సమన్వయంతో అడుగులు వేసి ఉంటే యూరియా పక్కదారి పట్టకుండా చాలా వరకు నియంత్రించగలిగే వారు. కానీ ఆయా విభాగాల మధ్య సమాచార లోపంతో పాటు బాధ్యతల విషయంలో స్పష్టత లేకుండా వ్యవహరించడం కూడా పరిస్థితి అదుపు తప్పడానికి కారణమైందన్న విమర్శలు వస్తున్నాయి.

రైతుల మధ్య ఘర్షణలు..

యూరియా నిల్వలు వచ్చాయని తెలిస్తే ఆర్ఎస్కేలు, సొసైటీల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో రైతుల మధ్య ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రేపల్లె మండలం నల్లూరుపాలెంలో ఎరువుల కోసం శుక్రవారం రైతులు ఎగబడటంతో చిన్నపాటి గొడవలు జరిగాయి. పోలీసులు దగ్గరుండి క్రమపద్ధతిలో రైతులకు యూరియాను అందించాల్సి వచ్చింది. పలుకుబడి ఉన్నవారు ఐదు, పదికట్టలు క్యూలో నుంచోకుండా తీసుకువెళ్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొంతమంది దళారులు, పీఏసీఎస్ అధ్యక్షులు అధిక ధరలకు యూరియాను అమ్ముకుంటున్నారంటున్నారు.

అవీ..ఇవీ..

నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి

- వీరరాఘవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధుల మంజూరు
- పాలక మండలి కమిటీ ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే కొండయ్య



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న దేవాలయ కమిటీ ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేసి భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీవీరరాఘవస్వామి వారి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.48 లక్షలు మంజూరు కాగా, దేవస్థానం ప్రతినిధుల నుంచి రూ.24 లక్షల నిధులతో పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. అలాగే నూతన ధర్మకర్తలి మండలి చైర్మన్‌గా మామిడాల రాములు, డైరక్టర్లతో ప్రమాణీ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ జనార్ధనరావు తదితర కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూల్ ఉల్లి రైతులకు అండగా ఉండాలి

కర్నూల్ ఉల్లి రైతులకు అండగా ఉండాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. అక్కడి ప్రతికూల పరిస్థితులు కారణంగా రైతులు సంక్షోభంలో ఉన్నట్లు వివరించారు. ఈక్రమంలోనే అండగా ఉండేందుకు మార్కెట్ ధరం కంటే తక్కువగా కిలో రూ.17లకే ఉల్లి అందిస్తున్నట్లు వివరించారు. శుక్రవారం పట్టణంలో ఉల్లి విక్రయాలను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న నేతలు

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలో వేంచేసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా దగ్గుబాటి చౌదరితోపాటు, పాలక మండలి సభ్యులు ప్రయాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ చౌదరి తెలిపారు. పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు హాజరై నూతన పాలక మండలిని అభినందించారు. కార్యక్రమంలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, కుంకలమర్రు సొసైటీ అధ్యక్షులు బంగారుబాబు, మండలపార్టీ అధ్యక్షులు తిరుముల శెట్టి శ్రీహరి, ఇంకొల్లు టీడీపీ సీనియర్ నేత శ్రీను, స్థానిక టీడీపీ నేతలు జాగర్లమూడి ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

తోటవారిసత్రంలో గది నిర్మాణానికి శంకుస్థాపన



గది నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కూటమి నాయకులు

చినగంజాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని తోటవారిసత్రం ఆవరణలో నూతన గది నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. పురుషోత్తమ పట్టణానికి చెందిన తోట వంశీకులు గ్రామంలో 1953 సంవత్సరంలో తోటవారి సత్రాన్ని నిర్మించారు. శిథిలావస్థకు చేరిన సత్రాన్ని ఇటీవల కాలంలో తొలగించారు. దీంతో ఏలూరి సాంబశివరావు సత్రం పునర్నిర్మానానికి దేవదాయశాఖ ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో నిర్మించే ఒక గది నిర్మాణానికి కూటమి నాయ కులు, తోట వంశీకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈ.వో ఎం.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, కూటమి నాయకులు, తోటవారిసత్రం వంశీకులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన సందడి

- ఒక్కొక్కటిగా తరలుతున్న గణనాథుని విగ్రహాలు
- లడ్డూ కోసం భక్తుల పోటీ
- బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



నిమజ్జనానికి తరలివెళుతున్న పాత ఆంధ్రబ్యాంకు సమీపంలోని వినాయకుడు

అద్దంకి సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జన ఉత్సవాలు శుక్రవారం ఉత్సహంగా సాగాయి. అద్దంకి పట్టణంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను శు క్రవారం రాత్రి గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేశారు. డప్పు వాయిద్యాలు, కళాకారుల నృత్యాల నడుమ నిమజ్జనోత్సవాలు సాగాయి. పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఉంచిన లడ్డును లాటరీ ద్వారా ఆర్యవైశ్య నాయకుడు గోపు శ్రీనివాసరావు దక్కించుకున్నారు. అనంతరం 12 వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్ ఆధ్వర్యంలో నిమజ్జనోత్సవం ఉత్సాహంగా సాగింది. అద్దంకి పట్టణంలోని బలిజపాలెం, కాకానిపాలెం, యాదవుల బజారు, వైఎస్ఆర్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలతో పాటు మండలంలోని తిమ్మాయపాలెం, శంకవరప్పాడు తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహాల నిమజ్జనాలు శుక్రవారం నిర్వహించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోటాపోటీగా వినాయకుల ఏర్పాటు

అద్దంకి : మండలంలోని నాగులపాడులో పోటాపోటీగా ఏర్పాటు చేసే రెండు వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఉత్సాహంగా నిర్వహిస్తుంటారు. ఈ నిమజ్జనోత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2004లో ప్రారంభమైన వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనోత్సవాల నిర్వహణ ఏటికేడు ప్రత్యేకత సంతరించు కుంటోంది. గ్రామంలోని రెండు వర్గాలు రెండు దశాబ్దాలుగా పోటాపోటీగా భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడంతో పాటు, నిమజ్జనోత్సవాలను లక్షల రూపాయలు వెచ్చించి ఘనంగా నిర్వహిస్తుంటారు. గత ఆరేడు సంవత్సరాలు గా గ్రామంలోని రెండు ప్రధాన వర్గాలు టీడీపీలోనే ఉన్నప్పటికీ, వినాయక విగ్రహాలను మాత్రం వేర్వేరు గానే ఏర్పాటు చేసి, ఎవరికి వారే ఘనంగా నిమజ్జన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కరి పరమేష్ వర్గం గొట్టిపాటి యూత్ పేరుతో ని మ జ్జ నో త్స వా లు నిర్వహిస్తుండగా, తెలుగు యువత నాయకులు పెంట్యాల రామాంజనేయులు ఆధ్వర్యంలో నాగులపాడు తెలుగుయువత పేరుతో వినాయక విగ్రహం ఏర్పాటు, నిమజ్జనోత్సవం నిర్వహిస్తుంటారు. రెండు వి గ్రహాలు తెలుగుదేశం నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తుండడంతో ఇరువర్గాలు ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల వద్దకు మంత్రి రవికుమార్ హజరై పూజలు నిర్వహిస్తుంటారు. కొవిడ్ సమయంలో మినహా మిగిలిన అన్ని సంవత్సరాలలో రెండు వర్గాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపులు ఉదయం నాగులపాడు గ్రామంలోని అన్ని ప్రధాన వీధులలో నిర్వహిస్తారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల సమయానికి అద్దంకి పట్టణంలోకి చేరుతుంది. భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ వెలుగులు, వివిధ రకాల వాయిద్యాలు, కళాకారుల నృత్యాల మధ్య అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ నుండి భవానిసెంటర్ వరకు అర్ధరాత్రి వరకు ఊరేగింపులు నిర్వహిస్తారు. అద్దంకి పట్టణంతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాల లోని పలు ప్రాంతాల నుండి భక్తులు వినాయక నిమజ్జనోత్స వాలను తిలకించేందుకు భారీగా తరలివస్తారు.







గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలోని వినాయకుడు, అద్దంకిలో లడ్డూను దక్కించుకున్న శ్రీనివాసరావు, అంబడిపూడిలో లడ్డూతో అంజయ్య,

నేడు వినాయక నిమజ్జనం

గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనోత్సవం శనివారం నిర్వహిస్తుండగా, నాగులపాడు తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక వి గ్రహం నిమజ్జనోత్సవము ఈ నెల 13న నిర్వహించనున్నారు.

బల్లికురవ : వినాయకచవితి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథులకు నవరాత్రుల పూజల అనంతరం శుక్రవారం ఘనంగా నిమజ్జన వేడుకలు నిర్వహించి వీడ్కోలు పలికారు. మండలంలోని గుంటుపల్లి శివాలయంలో, చినఅంబడిపూడి బొడ్డురాయి కూడలిలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాల నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాలలో గణనాథుల వద్ద ఏర్పాటు చేసిన లడ్డులను గ్రామ టీడీపీ నేతలు దద్దాల అంజయ్య, మలినేని గోవిందరావులు దక్కించుకొని పెద్ద ఎత్తున ఊరేగింపు మధ్య నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. గుంటుపల్లి గ్రామంలో దక్షిణం బజారులో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద శుక్రవారం రాత్రి ప్రముఖ భజన కళాకారుడు డప్పు శ్రీను బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు.

నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఉచితంగా పంపిణీ

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్‌బాబు

మార్టూరు, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బేపల్లికొండపై ఫారెస్ట్ అటవీ భూములలో పెంచుతున్న నర్సరీ నుంచి అవసరమైన వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు మండలంలోని బొబ్బేపల్లి కొండపై 350 ఎకరాల వరకు అటవీ భూములు ఉన్నాయి. ఈ భూములలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటుచేసి, 40 వేల మొక్కలను పెంచుతున్నామన్నారు. ఈ నర్సరీలో చింత, నేరేడు, ఉసిరి, జామ, దానిమ్మ, నిమ్మ, రావి తదితర మొక్కలను పెంచుతున్నారు. అయితే చుట్టుప్రక్కల గ్రామాలలోని ప్రభుత్వ స్కూళ్లు, లేదా ప్రవేటు విద్యాలయాలు, ఇంకాఏమైనా సంస్థలు వారు, మొక్కలు కావలసిన వారు సంబంధిత అధికారుల ధ్రువీకరణ పత్రం తీసుకువస్తే వారికి ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. అంతేగాకుండా ఎవరైనా గ్రామస్థులు ఆధార్ కార్డుతో వస్తే నాలుగు లేదా 5 మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఇంకా భారీగా మొక్కలు కావలసిన వారు ఎంపీడీవో ధ్రువీకరణ పత్రంతో వస్తే మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. ఇదిలా ఉండగా ఫారెస్ట్ కొండపై కొంతమంది వన్యప్రాణులను వేటాడుతున్నారని, జంతువులను పట్టుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో శుక్రవారం ఆయన కొండ సమీపంలో, టీడీపీ నాయకులు చింతలపూడి శ్రీనివాసరావు సమక్షంలో రాజుగారిపాలెం వాసులతో మాట్లాడారు. అటవీ భూములలో వేట నిషిద్ధమన్నారు.కొండపై జంతువులను వేటాడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



రాజుపాలెం వాసులతో మాట్లాడుతున్న అధికారులు



అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలు

భక్తిశ్రద్ధలతో మీలాద్ ఉన్ నబి పర్వదినం

పర్చూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజును పురస్కరించుకొనే మీలాద్ ఉన్ నబి పర్వదినాన్ని ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రమైన పర్చూరులోని పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ మాట్లాడుతూ ఇస్లామిక్ చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం మూడో నెల అయిన రబిపుల్ అవ్వల్లో ఈ పండుగ వస్తుందన్నారు. నీలాదూర్ నబి అంటే ప్రవక్త యొక్క జననమని అర్థమన్నారు. అనంతరం ముస్లింలు జెండాలతో మసీదు నుంచి చీరాలరోడ్డులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు అహ్మద్ బాషా, నబీసా, షేక్.బాషా(కొబ్బరిబోండా), కాలేషా, మస్తాన్, బుల్లా మేస్త్రీ, షేక్.గౌస్, బాజీ, పఠాన్ బాజీ, ఖాజావలి పాల్గొన్నారు.



పర్చూరులో జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వేటపాలెం(చీరాల) : వేటపాలెంలో శుక్రవారం ఘనంగా మిలాద్ - ఉన్ - నబీ వేడుకలు ముస్లిం మతపెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రవక్త మహ్మద్ సలల్లాహు అలైహీ వసలం జననాన్ని పురస్కరించుకుని నిర్వహించే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు వివరించారు. గురువు, మహా ప్రవక్త వేడుకలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుభానీ, షఫీవుల్లా, అన్వర్‌బేగ్, రఫీ, జునైద్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో అర్జీల స్వీకరణ

చీరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో కూటమి నాయకులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు గంజి పురుషోత్తం మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో పించన్ 15, నివేశన స్థలాలు 60, ఇతర సమస్యలకు సంబంధించి 5 అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పద్మిని, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పోటీపరీక్షలతో విద్యార్థుల సామర్థ్యాల గుర్తింపు



విజేతకు బహుమతి అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

పంగులూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించ వచ్చని, రోటరీక్లబ్ అధ్యక్షుడు, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బత్తులవీరనారాయణ అన్నారు. గత నెల 19న రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంయుక్తంగా నిర్వహించిన ప్రతిభా పరీక్షల విజేతలకు గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం బహుమతి ప్రదానం చేశారు. మండల స్థాయిలో జరిగిన ఈ పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల పది, తొమ్మిది, ఆరవతరగతి విద్యార్థులు కట్టా వంశీకృష్ణ, కేజాకబ్, శ్రీవిద్య, బూదవాడ ఉన్నత పాఠశాల 8వతరగతి విద్యార్థిని జి.హరిణి, కోటపాడు 7వ తరగతి విద్యార్థిని పి.నిఖితలు ప్రథమ స్థానంలో నిలిచారు. రిషితమారుతి, అర్పిత, పవన్‌గోపి, మమతారెడ్డి, హర్షిత ద్వితీయస్థానం దక్కించుకున్నారు. హెచ్‌ఎం సోమేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి రాయిణి రామారావు, అజిత్‌ట్రస్ట్ చైర్మన్ వీరనారాయణ క్లబ్ ప్రతినిధులు తాటిసుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, పోతిన ప్రసాద్, పూర్వవిద్యార్థి సంఘం అధ్యక్షుడు తలపనేని రామాంజనేయులు, హెచ్‌ఎంలు శ్రీహరి, వేణుబాబు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చెరుకూరు (పర్చూరు), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చెరుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీ త్రివిక్రమ, అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామివార్ల కల్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో భాగంగా స్వామివార్లకు హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహణ కార్యదర్శి దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చీరాల్లో మరోసారి గంజాయి పట్టివేత

- కదిలే రైలులో జిల్లా ఈగల్ టీం తనిఖీలు

చీరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల్లో మరోసారి గంజాయి కలకలం రేపింది. జిల్లా ఈగల్ టీం శుక్రవారం రాత్రి కదిలే రైలు బోగీలో తనిఖీలు నిర్వహిస్తుండగా 4 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో కేసు నమోదు చేసుకుని స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల కాలంలో గంజాయి పెద్ద మొత్తంలో పట్టుబడుతుండటంతో ప్రజలు భీతిల్లుతున్నారు.

రంగస్థల కళాకారుడు కాశీరాజు కన్నుమూత



కాశిరాజు (ఫైల్)

సంతమాగులూరు సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : ప్రకాశం బాపట్ల పల్నాడు గుంటూరు జిల్లాల కళాభిమానులకు సుపరిచితుడైన యాదాల కాశీరాజు (79) శుక్రవారం కన్ను మూశారు. కాశిరాజుకు భార్య కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. మోకాళ్ల శస్త్ర చికిత్స నిమిత్తం ఒంటరిగా హైదరాబాదు వెళ్లిన కాశయ్య ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంటికి వచ్చి కన్నుమూశారు. సత్య హరిచంద్ర శ్రీరామాంజనేయయుద్ధం వీరబ్రహ్మంగారి నాటకం, బభ్రువాహన, యాదులరాజు, శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ చరిత్ర తదితర నాటకాలలో ప్రముఖ పాత్రలను పోషించి ఆయన ప్రజల మెప్పును పొందారు. సత్య హరిచంద్రలో కాట శీను హరిశ్చంద్రుడిగా యాదాల కాశయ్య ప్రసిద్ధి. ప్రముఖ రంగస్థలం కళాకారులు ఏవీ సుబ్బారావు డీవీ సుబ్బారావు, మిద్దె ఆంజనే యులు, చీమకుర్తి నాగేశ్వరరావుకు కాశయ్య సమకాలీకులు.

లస్కర్‌గానూ సేవలు : ఎన్ఎస్‌పీ కాలువలపై లస్కర్‌గానూ విధులు నిర్వహించిన ఆయన 30 సంవత్సరాలపాటు రైతులకు సేవలందించారు. 2006లో ఉద్యోగ విరమణ చేశారు. కాశయ్య పెద్ద కుమారుడు యాదాల శ్రీనివాసరావు ప్రస్తుతం పల్నాడు జిల్లా ల్యాండ్ రికార్డ్ సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. రెండవ కుమారుడు ఆంజనేయులు మతిస్థిమితం కోల్పోయిన వారికి ప్రకృతి వైద్యం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కాశయ్య అల్లుడు గోపాలకృష్ణ కూడా లస్కర్ గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

సంతరావూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటి బాధ్యతల స్వీకరణ

చినగంజాం, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని సంతరావూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన త్రీమన్ కమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం నిర్వహించారు. సంతరావూరు పీఏసీఎస్ ఆవరణలో పర్సన్ ఇన్‌చార్జ్‌గా యార్లగడ్డ లక్ష్మీ, సభ్యులుగా బండారు ఆంజనేయులు, మైలా ప్రసాద్‌లతో పీఏసీఎస్ సీఈవో కే.కృష్ణచైతన్య ప్రమాణస్వీకారం చేయించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఏవో ఆర్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో యార్లగడ్డ లక్ష్మీ మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించి, వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కర్షకమిత్ర పథకం ద్వారా మంజూరైన రూ.50 లక్షల విలువైన చెక్కులను నలుగురు రైతులకు అందజేశారు. సంతరావూరు రైతు సేవాకేంద్రం ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం సంఘం ఆవరణలో ఆమె, అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు పర్చూరు శాఖ సూపర్‌వైజర్ కే.శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు దేవతోటి సుందరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆతిన సురేష్, కనకనాగ వరపమ్మ అమ్మ వారి దేవస్థాన చైర్మన్ వలేటి ఆంజనే యులు, టీడీపీ నాయకులు కేశనపల్లి శ్యాంబాబు, గోవిందు సుబ్బారావు, ఉప్పుటూరి సునీల్, ఆర్ఎస్‌కే సిబ్బంది బి.కిషోర్, కృపాసిని, పీఏసీస్ సిబ్బంది పాల్గొన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న పర్సన్ ఇన్‌చార్జి యార్లగడ్డ లక్ష్మి